ninadam.in

# నినాదం

తెలుగు దినపత్రిక

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 8 జూన్ 2026 | సంపుటి: 22 | సంచిక: 250 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal
Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

నాడు ఆస్తిత్వం కోసం పోరాటం..

## నేడు ఉపాధి కోసం పడిగాపులు!

**ఉద్యమకారుడి దీనగాధ**



**ఆనాడే చనిపోతే బాగుండు అంటూ ఉద్యమకారుడు నాగరాజు ఆక్రందన** 2

నాడు అస్థిత్వం కోసం పోరాటం..నేడు ఉద్యోగం కోసం పడిగాపులు.. ఇది నేటి తెలంగాణ రాష్ట్ర మలి దశ తెలంగాణ ఉద్యమకారుడి రోదన...

## పాలమూరులో ప్రజా పాలన..

# ప్రజల గుండెల్లో జూపల్లి



**ప్రజల మనిషి... పాలమూరు గర్వకారణం... పరిపాలనలో పట్టుదల, అభివృద్ధిలో దూరదృష్టి**

**తెలంగాణ రాజకీయాల్లో కొన్ని పేర్లు కేవలం నాయకులుగా మాత్రమే కాదు... ఒక ప్రాంత ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన నాయకుల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఒకరు. కొల్లాపూర్ గడ్డ నుంచి రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జూపల్లి, ప్రజాసేవను రాజకీయాల కంటే గొప్ప బాధ్యతగా భావించిన నాయకుడు. గ్రామీణ జీవితం నుంచి వచ్చిన ఆయనకు రైతు కష్టం తెలుసు... కూలీ చెమట విలువ తెలుసు... సామాన్యుడి బాధ అర్థమవుతుంది. అందుకే ప్రజలతో ఆయనకు ఏర్పడిన అనుబంధం ఎన్నికల విజయాలకే పరిమితం కాలేదు, విశ్వాసంగా మారింది.**

**(బిజిగిరి శ్రీనివాస్ నినాదం ఎడిటర్)**





**పాలమూరు ప్రజల ఆశలకు ప్రతినిధి**

పాలమూరు అంటే ఒకప్పుడు కరువు, వలసలు, నిరుద్యోగానికి ప్రతీక. అలాంటి ప్రాంత సమస్యలను అసెంబ్లీలో గట్టిగా వినిపించిన నాయకుల్లో జూపల్లి ముందుంటారు. తాగునీరు, సాగునీరు, విద్య, రహదారులు, ఆసుపత్రులు, ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాడారు. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆయన పాత్ర విశేషం. ప్రజల మధ్యే ఉంటూ, గ్రామాల వారీగా సమస్యలను తెలుసుకుంటూ, అధికారులను క్షేత్రస్థాయిలో పనిచేయించే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ప్రతి రోజూ ప్రజల మధ్య ఉండే నాయకత్వం ఆయనది.

**మంత్రిగా పరిపాలనలో ప్రత్యేక ముద్ర**

ప్రస్తుతం పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు మరియు ఎక్సైజ్ శాఖలను నిర్వహిస్తున్న జూపల్లి కృష్ణారావు, ప్రతి శాఖలో తనదైన పరిపాలనా శైలిని చూపిస్తున్నారు. ఫైళ్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిర్ణయాలు తీసుకోవడం ఆయన ప్రత్యేకత. పర్యాటక రంగంలో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపద, ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**ఎక్సైజ్ శాఖలో సంస్కరణల దిశగా**

ఎక్సైజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత జూపల్లి కృష్ణారావు అక్రమ మద్యం వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గుడుంబా తయారీ, నకిలీ మద్యం విక్రయాలు, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.
మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నకిలీ మద్యం వల్ల పేద కుటుంబాలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఎక్సైజ్ శాఖలో పారదర్శకత పెంచేందుకు సాంకేతికత వినియోగం, డిజిటల్ పర్యవేక్షణ, అక్రమ రవాణాపై ఇంటెలిజెన్స్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూస్తూనే, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై రాజీ లేకుండా వ్యవహరించడం ఆయన పరిపాలనా విధానంలో కనిపిస్తుంది.

**ప్రజలతో మమేకమయ్యే నాయకుడు**



నేటి రాజకీయాల్లో పదవులు వచ్చిన తర్వాత ప్రజలకు దూరమయ్యే నాయకులు చాలామంది ఉంటారు. కానీ జూపల్లి కృష్ణారావు మాత్రం ప్రజల మధ్యే ఉండే నాయకుడు. ఎక్కడ సమస్య వచ్చినా స్పందించడం, బాధితులను పరామర్శించడం, అధికారులను అప్రమత్తం చేయడం ఆయన సహజ స్వభావం. కొల్లాపూర్ ప్రజలు ఆయనను కేవలం ఎమ్మెల్యేగా కాకుండా కుటుంబ సభ్యుడిలా భావించడానికి కారణం ఇదే. రాజకీయ ప్రత్యర్థులు కూడా ఆయన వ్యక్తిగత నిరాడంబరతను, ప్రజలతో అనుబంధాన్ని ప్రశంసిస్తుంటారు.

నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతూ, ఎన్నో రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన జూపల్లి కృష్ణారావు నేడు తెలంగాణ రాజకీయాల్లో ఒక విశ్వసనీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజల సమస్యలపై అవగాహన, పరిపాలనలో అనుభవం, అభివృద్ధిపై దూరదృష్టి, తెలంగాణ సంస్కృతిపై మమకారం—ఇవన్నీ కలిసిన నాయకత్వమే జూపల్లి కృష్ణారావు.

**"ప్రజల కోసం ఆలోచించే నాయకుడు... ప్రాంత అభివృద్ధి కోసం పోరాడే యోధుడు... తెలంగాణ గర్వించే ప్రజానాయకుడు"**

**తెలంగాణ సంస్కృతికి అంబాసిడర్**

జూపల్లి కృష్ణారావు కేవలం పరిపాలకుడే కాదు, తెలంగాణ సంస్కృతికి ప్రచారకుడు కూడా. బతుకమ్మ, బోనాలు, సమ్మక్క-సారలమ్మ జాతర వంటి ఉత్సవాలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నాల్లో ఆయన ఎప్పుడూ ముందుంటారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రోత్సహించడం ద్వారా యువతలో తెలంగాణ చరిత్రపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

---

### నియంత్రణ లోటు...

## పేరెంట్స్ మెడపై ప్రైవేటు

**పిల్లల చదువు... వారి కుటుంబాలకు శిక్ష**

**విద్యా మాఫియా గుప్పిట్లో తల్లిదండ్రులు**

**ఫీజుల పేరిట బహిరంగ దోపిడీ**

**అంతా తెలిసే నడుస్తోందని ప్రభుత్వంపై ఆరోపణలు** 2




ఒకప్పుడు పిల్లలను స్కూల్లో చేర్పించడం తల్లిదండ్రులకు ఆనందం. నేడు అదే ఆందోళన. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే చాలు... లక్షలాది కుటుంబాలకు ఆర్థిక కష్టాల కాలం మొదలవుతోంది. పుస్తకాల బ్యాగ్ కంటే ముందే ఫీజుల భారం తల్లిదండ్రుల భుజాలపై పడుతోంది.

**- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జూన్ 7 (నినాదం)**



## ఏపీలో రేర్ ఎర్త్ హబ్ 2

**రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ**

## వేసవి సెలవులు పొడిగింపు

### జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభం

**జూన్ 13 రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో షెడ్యూల్ మార్పు**

తెలంగాణ విద్యార్థులకు విద్యాశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. వేసవి సెలవులను పొడిగించింది. జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జూన్ 13 రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో షెడ్యూల్ మార్పు చేశారు. జూన్ 13 రెండో శనివారం సెలవుకు బదులు జులై 11న తరగతులు నిర్వహించనున్నారు. **- హైదరాబాద్, జూన్ 7 (నినాదం)**



2

---

### హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

**కేంద్ర మంత్రిపై సీఎం రేవంత్ ఫైర్**

కేంద్రం నుంచి తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు రాకుండా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డినే అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఫైర్ అయ్యారు. ప్రజలతో పెట్టుకున్నావారెవరూ కూడా బతికి బట్టకట్టలేదని, కిషన్ రెడ్డికి వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీ తర్వాత కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

**- హైదరాబాద్, జూన్ 7 (నినాదం)** 2

### రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

ఏ అంశంపై ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేటోడు తెలంగాణలో ఇంకా పుట్టలేదని కిషన్‌రెడ్డి అన్నారు.

**- హైదరాబాద్, జూన్ 7 (నినాదం)**



2

### పరిపాలన సౌలభ్యం కోసమే

# జీహెచ్ఎంసీ విభజన

**మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం: సీఎం**

**ఉప్పల్ భగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి**

పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం విభజించామని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓఆర్ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ఉన్నారన్న సీఎం, అంతమంది జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదన్నారు.

**- మేడ్చల్ కలెక్టరేట్ జూన్ 7 ( నినాదం):** 2



### రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై

## కేటీఆర్ కౌంటర్

**మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా**

**మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ**

**తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి**

**బెంగళూరులో రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్ పోస్ట్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 2

**- హైదరాబాద్, జూన్ 7 (నినాదం)**



---

### రాష్ట్రపతి పాలన రాకూడదనే మద్దతు



**తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ కీలక వ్యాఖ్యలు** 2

### చేప ప్రసాదం పంపిణీకి

## సర్వం సిద్ధం 2

**తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

## నేడు 23 పార్టీలతో ఇండి సమావేశం

**ఎన్నికల తర్వాత తొలిసారి!**

**ఇండియా జన్ బంధన్' పేరుతో సమావేశం**

**హాజరు కానున్న 23 రాజకీయ పార్టీలు**

**వివరాలు వెల్లడించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్** 2



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి ప్రతిపక్ష ఇండి కూటమి సమావేశం సోమవారం ఢిల్లీలో జరగనుంది. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే ఈ భేటీకి 'ఇండియా జన్ బంధన్' అని నామకరణం చేశారు.

**- న్యూఢిల్లీ, జూన్ 7 (నినాదం)**

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

"మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు.
శనివారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

# నేడు 23 పార్టీలతో ఇండి సమావేశం



ఈ సమావేశానికి 23 రాజకీయ పార్టీలకు చెందిన నేతలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఇతర కారణాలతో కొన్ని పార్టీలు ఈ భేటీకి రాలేకపోతున్నట్లు సమాచారం ఇచ్చాయని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకానప్పటికీ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి మద్దతు ఉంటుందని సందేశం పంపాయని జైరాం రమేశ్ చెప్పారు.

**''ఇండియా జన్ బంధన్' ఐక్యంగా ముందుకు సాగుతుంది'**

భారత్ లాగే 'ఇండియా జన్ బంధన్' కూడా తన వైవిధ్యాన్ని చాటుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడంపై ఇండి కూటమి సమావేశం కానుంది. జాతీయ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఉమ్మడి వ్యూహాలతో ఎలా నిలదీయాలనే అంశంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృతంగా చర్చలు జరిపే అవకాశం ఉంది. వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా విపక్ష పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ఈ భేటీ కీలకం కానుంది.

**'లక్షలాది యువత ఆశలు, ఆకాంక్షలకు ద్రోహం చేస్తూ'**

అయితే, ఎక్స్ పోస్టులో జైరాం రమేశ్ ఇంకా కొన్ని విషయాలను పంచుకున్నారు. కోట్లాది మంది భారతీయుల ఓటు హక్కును కాలరాయడంతో పాటు రాజ్యాంగంపై దాడి, విపక్షాలను దర్యాప్తు బృందాలు లక్ష్యంగా చేసుకోవడం వంటి పరిణామాలను ఆయా పార్టీలు ఖండించాయని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అలాగే, కోట్లాది మంది భారతీయుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తూ, ఎడతెరిపి లేని ధరల పెరుగుదలతో కుటుంబ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ, లక్షలాది యువత ఆశలు, ఆకాంక్షలకు ద్రోహం చేస్తూ, పెట్టుబడుల వాతావరణాన్ని నీరుగారుస్తూ, తన విదేశాంగ విధానంతో జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలకు పార్టీల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు.

**భేటీకి హాజరుకాని డీఎంకే**

ఇక, ఈ భేటీ విషయానికొస్తే, వ్యక్తిగత కారణాల వల్ల కొన్ని పార్టీలు ఈ సమావేశానికి హాజరుకాలేక పోతున్నాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇండి కూటమిలోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. తమిళనాడులో కాంగ్రెస్ 'ద్రోహం' చేసిందని ఆరోపిస్తూ డీఎంకే ఈ సమావేశానికి గైర్హాజరు కానుండగా, కేరళలో వామపక్షాలు బీజేపీతో కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ అగ్ర నాయకులు చేసిన ఆరోపణలపై సీపీఐ(ఎం) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కూటమికి ఆప్ బహిరంగంగానే దూరంగా ఉండగా, ఈ సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే ఇదివరకే నిర్ణయం ప్రకటించింది.

**'ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరగబోతోంది'**

ఇక, దిల్లీ వేదికగా సోమవారం జరగనున్న ఇండి కూటమి సమావేశంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పందించారు. చాలా కాలం తర్వాత ఇండి కూటమి అధికారిక సమావేశం జరగబోతోందని చెప్పారు. అయితే, దీని ఎజెండా ఏమిటి, సమావేశానికి ఎవరెవరు హాజరవుతారు అనే విషయాలపై స్పష్టత లేదని, కానీ చర్చించాల్సిన అంశాలు మాత్రం చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశం స్పష్టమైన సంకల్పంతో, స్నేహపూర్వక వాతావరణంలో జరగబోతోందని, అలాగే, ఇండి కూటమి ఐక్యంగా ఉందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ'బ్రెయిన్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత అనేక రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య, ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంగా ఈ సమావేశం కనిపిస్తోంది. గతంలో కూడా పార్లమెంటు సమావేశాలకు ముందు సంప్రదింపుల కోసం ఇండి కూటమి నాయకత్వం సమావేశమయ్యేది. ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీలు సభలో సమన్వయం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేవి.

# నాడు ఆస్తిత్వం కోసం పోరాటం.. నేడు ఉపాధి కోసం పడిగాపులు!

**నల్లగొండ ప్రతినిధి జూన్ 7 (నినాదం):**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మా నిధులు మాకు,మా నీళ్లు మాకు మా ఉద్యోగాలు దక్కుతాయని ఆశించిన యువతకు గత పన్నెండేళ్లలో మొండి చెయ్యి తప్ప ఆరాట పడ్డ విధంగా ఉద్యోగ, ఉపాధి దాదాపుగా శూన్యం అయిందని వాపోతున్నారు.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం ఉదృతంగా కొనసాగుతున్న తరుణంలో యువత ఆవేశాలకు అంతు వుండక పోయేది.ప్రత్యేక రాష్ట్రం సిద్ధిస్తే మా బతుకులు మారతాయని ఉద్యమంలో యువత చురుకుగా పాల్గొన్నారు.ఉడుకు రక్తం ప్రవహిస్తున్నట్లు ఆవేశాలు,ఆవేదనలు పెరిగిపోయాయి. పరాయి ప్రాంత పాలనలో తీవ్ర నష్టం చవి చూస్తున్నామని భావించారు. దీంతో రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగం పంచుకున్నారు.యువత ఆవేశాలకు పోయి ఆత్మహత్యలకు పూనుకున్నారు.ప్రాణాలు పోగొట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200మందికి పైగా తెలంగాణ కోసం బలిదానం కాగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోను పదుల సంఖ్యలో ఉద్యమకారులు బలయ్యారు.అట్టి ఉద్యమకారులను,వారి కుటుంబాలను తమ కుటుంబ సభ్యులుగా చూసుకుంటామన్న పాలకులు నామమాత్రంగా ఉద్యోగ, ఉపాధి,ఆర్థిక సాయం చేసి చేతులు దులుపుకుంది.దీంతో ఇప్పటికీ వేలాది మంది అమరుల కుటుంబాలు రోడ్డున పడి ప్రభుత్వ సహాయం కోసం పడిగాపులు పడుతున్నాయి. అయిన పాలకుల్లో చలనం లేదని ఉద్యమరుల ఆవేదన పట్టడం లేదని పలువురు ఉద్యమకారులు ,కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి నల్గొండ జిల్లాలోనీ గరిడేపల్లి మండలం రాయనిగూడెం గ్రామానికి చెందిన పిడమర్తి నాగరాజు ఉద్యమ తీవ్రత సమయంలో డిగ్రీ చదుతున్నాడు.ఉద్యమకారుల జేఏసీ లో చురుకుగా పాల్గొంటూ ఉద్యమ తీవ్రతను నాటి పాలకుల దృష్టికి తీసుకుపోయేలా చేసేవారు.అయిన కేంద్రంలో అధికారంలో పాలకపక్షంలో చలనం లేకపోవడంతో 2011ఆగస్టు 15న మిర్యాలగూడ రైల్వేస్టేషన్ కు చేరుకుని హైదరాబాద్ నుండి గుంటూరు వైపు వెళ్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య యత్నం చేసుబోయాడు. ఆ సమయంలో నాగరాజుకు రెండు కాళ్ళు చేయి పోగొట్టుకున్నాడు.పూర్తిగా వైకల్యం పొందిన నాగరాజు నాటి పాలకులు అనేక హామీలు ఇచ్చి అమలుపర్చలేదు.కేవలం 10లక్షల ఎక్స్గ్రేషియో ఇచ్చి ఉద్యగం వారం రోజుల్లో ఇస్తామని చెప్పి పంపించివేశారు.నాటి నుంచి కలవని ఉపముఖ్య మంత్రి ,మంత్రి లేదు కలవని ఎంఎల్ఏ, ఎంఎల్సి లేదు.

**నాగరాజుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి..**

తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కాళ్ళు, చేయి పోగొట్టుకొని పూర్తి వైకల్యం పొందిన పిడమర్తి నాగరాజుకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు మాలోతు దశరథ్ నాయక్,బంటు వెంకటేశ్వర్లు,క్రాంతి కుమార్ నాయక్ లు కోరారు.తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధ పడ్డ ఉద్యకారుడినీ ఉద్యోగం ఇవ్వకుండా తిప్పుకోవడం సరైంది కాదన్నారు.

ఇలా 12ఏండ్లు గడిచిపోయాయని జీవితం మీద విరక్తి పుట్టిందని చనిపోవాలని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైలు ప్రమాద సమయంలో చనిపోయి ఉంటే బాగుండేదని రోధిస్తూ విలపించారు.ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం,మంత్రులు, ఎంఎల్ఏ, ఎంఎల్సిలు స్పందించి ఉద్యకారుడికి న్యాయం చేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు.

# పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీ విభజన

ఉప్పల్ భగాయత్‌తో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి ఎంఎంసీతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల సౌలభ్యం కోసమే ఉప్పల్‌లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.
ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన కీలక ప్రాజెక్టులలో పాలనాపరమైన, మౌలిక, వైద్య సదుపాయాలు ఉన్నాయి. ప్రజల పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఉప్పల్ ప్రాంతంలోనే 10 ఎకరాల సువిశాల స్థలంలో రూ.98 కోట్ల వ్యయంతో సరికొత్త మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని నిర్మించనున్నారని ఆంధ్రజ్యోతి రిపోర్ట్ చేసింది. దీంతో పాటు ఈ ప్రాంతంలో నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఏటిసి సెంటర్ చుట్టూ రూ.960 కోట్ల భారీ వ్యయంతో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అలాగే, టీకేఆర్ కాలేజ్ జంక్షన్‌లో ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు రూ.416 కోట్ల అంచనా వ్యయంతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.
మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యచరణ వెంటనే చేపట్టాలి : ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టామన్నారు. బండారు రాజిరెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేద్దామని చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు, దిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని యోగి ఆదిత్యనాద్ చెప్పుకున్నారన్నారని గుర్తుచేశారు. మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారని, మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారని ఆక్షేపించారు. ఉప్పల్, నల్గొండ ప్రజలు మూసీ మురికితో ఇబ్బంది పడుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యాచరణ వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



**కొన్ని రాజకీయాల వల్ల అప్పట్లో ఓడిపోయా : సీఎం రేవంత్‌రెడ్డి**

పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం జీహెచ్ఎంసీని విభజించామని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలు ఉన్నారన్న సీఎం.. 1.34 కోట్ల జనాభాకు సదుపాయాలు కల్పించటమంటే ఆషామాషీ విషయం కాదన్నారు. ఏ పని కావాలన్నా అందరూ.. ట్యాంక్‌బండ్ వద్దకే వెళ్లాల్సి వస్తోందని సీఎం చెప్పారు. ప్రజల సౌలభ్యం కోసం ఉప్పల్‌లోనే మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఎన్నికలున్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలని సూచించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టామని, ఉప్పల్ చౌరస్తాలో బండారు రాజిరెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేద్దామన్నారు. మహిళల ఆశీర్వాదం వల్లే ఈ స్థాయికి ఎదిగానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. 2018లో కొడంగల్‌లో కొన్ని రాజకీయాల వల్ల ఓడిపోయానని, 4 నెలలకే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి ప్రజలు ఆదరించారన్నారు. రాజకీయంగా కిందపడిన తనను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలేనని చెప్పారు. మాల్కాజ్‌గిరి ప్రజల బలం వల్లే పీసీసీ అధ్యక్ష పదవి కూడా దక్కిందన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి భాజపాలోనే ఉండి.. కేటీఆర్‌కు సహకరిస్తారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా.. ప్రజల కోసం పనిచేస్తానని, ఇతర పార్టీలకు కాదని వ్యాఖ్యానించారు. మెట్రోకు ఎందుకు అనుమతులు రావడం లేదో కిషన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి ఈమేరకు ప్రసంగించారు. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేయాలన్నారు.
"గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, దిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని అక్కడి సీఎం యోగి చెప్పుకొన్నారు. ప్రధాని మోదీ నదులను ప్రక్షాళన చేశారని భాజపా నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారు. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల 15 తర్వాత మా కార్యాచరణ మారుతుంది. మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో.. రాష్ట్రంలో మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరో.. ఆర్ఆర్ఆర్‌కు నిధులు ఎందుకు ఇవ్వరో.. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం. మంచి పనుల విషయంలో రాజకీయాలు చేయొద్దు. ఓఆర్ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. ఈ స్థాయి జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదు. పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించాం. కానీ.. రాజకీయ లబ్ధి కోసమే విభజించామని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఉప్పల్‌లోనే మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయంగా కిందపడిన నన్ను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలే. కేంద్రం సహకారం లేకపోవడంతో అప్పుడు ఎంపీగా అనుకున్న పనులు చేయలేకపోయాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## రేవంత్ రెడ్డికి కిషన్‌రెడ్డి సవాల్

రేవంత్‌రెడ్డిలా తాను పది పార్టీలు మారలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. తన పుట్టుక.. నా చావు.. రెండూ బీజేపీలోనేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తానేంటో తెలంగాణ ప్రజలకు తెలుసని.. ఎంత రెచ్చగొట్టినా తొందరపడనన్నారు. అన్నింటికీ సమయమే సమాధానం చెప్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. లేకుంటే దళితులు, బీసీలు ఇంటికి వచ్చి ధర్నాలు చేస్తారన్నారు.

# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

**హైదరాబాద్, జూన్ 7 (నినాదం):**
హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే బత్తిని సోదరుల చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమైంది. మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆస్తమా రోగులకు అందించే ఈ ప్రసాదం పంపిణీ నేడు రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. మృగశిర కార్తె రాత్రి ప్రవేశిస్తుండటంతో ఈ మార్పు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జూన్ 9వ తేదీ రాత్రి వరకు ఈ పంపిణీ నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్వయంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, సీపీఆర్ బృందాలను సిద్ధంగా ఉంచారు. భద్రత కోసం పోలీసులు, షీ టీమ్స్, సీసీటీవీలతో నిఘా ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం పంపిణీ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు జూన్ 8 ఉదయం 6 గంటల నుంచి జూన్ 9 రాత్రి 8 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఆర్టీసీ బస్సులు, వ్యాన్లలో వచ్చేవారు గాంధీభవన్ లేదా గృహకల్ప వద్ద, ఆటోల్లో వచ్చేవారు షెజాన్ హోటల్ వద్ద దిగి గ్రౌండ్స్‌కు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

## రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

**అమరావతి, జూన్ 7 (నినాదం):**
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ & రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు, నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు భాగస్వామ్యం వహించాలని కోరాను" అని తెలిపారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా లోకేష్ సందర్శించారు. ఈ పర్యటన తనకు ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని, విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రపతి పాలన రాకూడదనే మద్దతు

**తమిళనాడు మాజీ సీఎం కీలక వ్యాఖ్యలు**

తమిళనాడులో ఇటీవల ఏర్పాటైన కొత్త ప్రభుత్వం.. మూడు నెలలైనా కొనసాగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారని డీఎంకే అధినేత స్టాలిన్ అన్నారు. టీవీకే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో.. ఆయన ఆరు నెలలపాటు విమర్శలు చేయబోనని, పాలనను పరిశీలిస్తామన్న మాటలను గుర్తుచేసుకున్నారు. కానీ నెలరోజులైనా గడవకుండా నూతన ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి.. తాము క్షేత్రస్థాయిలో 2026 ఎన్నికల కోసం చర్యలు చేపట్టామని తెలిపారు. కానీ కొందరు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించకపోయినా, ఓటర్లను నేరుగా కలవకపోయినా.. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాడు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం ఆపేందుకే తమ కూటమిలో ఉన్న భాగస్వామ్య పక్షాలతో టీవీకేకు అనుమతించామని స్టాలిన్ తెలిపారు. అలా చేసి ఉండకపోతే.. రాష్ట్రంలో బీజేపీ పాలనకు మార్గం చాలా ఈజీగా దొరికేదన్నారు.

# వేసవి సెలవులు పొడిగింపు

విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11న రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు. పాఠశాలల పునఃప్రారంభ తేదీలకు సంబంధించి పలు వర్గాల నుంచి ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్కూల్ రీఓపెనింగ్ తేదీల్లో మార్పు విషయాన్ని అన్ని జిల్లాల డీఈవోలు, ప్రధానోపాధ్యాయులు గమనించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు అల్పాహారం : సర్కారు బడులు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు చాలా మంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకుండానే చదువులకు వస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేలా అల్పాహారాన్ని అందించాలని నిర్ణయించింది. కొద్దిరోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు జిల్లాల వారీగా ప్రభుత్వ పాఠశాలల సమాచారం, విద్యార్థుల, కళాశాలలు విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలను చూసి గ్రామ, పట్టణ సర్కారీ బడుల్లో ఈ ఏడాది తమ పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండగా ఈ మేరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# నియంత్రణ లోటు... పేరెంట్స్ మెడపై ప్రైవేటు

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేశాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, టర్మ్ ఫీజు, బస్సు ఫీజు, యాక్టివిటీ ఫీజు, డిజిటల్ క్లాస్ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు... ఇలా పేర్లు మారుతున్నాయే తప్ప వసూళ్లు మాత్రం ఆగడం లేదు.

**చదువు కాదు... ఫీజుల సామ్రాజ్యం**

ఎల్‌కేజీ, యూకేజీ చదివే చిన్నారికి ఏటా రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతోంది. కొన్నిచోట్ల లక్ష రూపాయలు దాటుతోంది. పై తరగతులకు వెళ్లే కొద్దీ ఈ మొత్తం మరింత పెరుగుతోంది. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.
నెల జీతం చేతికి రాకముందే స్కూల్ ఫీజుల ఖాతాలోకి వెళ్లిపోతోందని ఉద్యోగులు, కార్మికులు, చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అప్పులు చేస్తుంటే, మరికొందరు బంగారం తాకట్టు పెట్టి పిల్లల చదువులు కొనసాగిస్తున్నారు.

**భవిష్యత్తు భయమే యాజమాన్యాలకు పెట్టుబడి !**

"ఐఐటీ ఫౌండేషన్", "ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్", "గ్లోబల్ ఎడ్యుకేషన్", "స్మార్ట్ లెర్నింగ్" వంటి ఆకర్షణీయ పదాలతో తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్న పాఠశాలలు, ఆ తర్వాత ఫీజుల పేరిట భారీగా వసూళ్లు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చైనా పెట్టాలనే తల్లిదండ్రుల బలహీనతను కొన్ని విద్యాసంస్థలు ఆదాయ వనరుగా మార్చుకున్నాయనే విమర్శలు ఉన్నాయి.

**ఫీజులే కాదు... ప్రతి అడుగులో వసూళ్లే**

పుస్తకాలు బయట కొనొద్దు.
యూనిఫాం బయట కుట్టించొద్దు.
బస్సు తప్పనిసరి.
యాన్యువల్ డే ఫీజు.
కల్చరల్ ఫీజు.
ఎడ్యుకేషనల్ టూర్ ఫీజు.
ఇలా ప్రతి కార్యక్రమం వెనుక అదనపు బిల్లులు జతవుతున్నాయి. ఫీజులు ఎందుకు పెంచారో అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.
నియంత్రించే యంత్రాంగం ఎక్కడ..?
ఫీజుల నియంత్రణకు చట్టాలు ఉన్నాయి.
కమిటీలు ఉన్నాయి.
విద్యాశాఖ ఉంది.
అయితే ప్రశ్న ఒక్కటే...

**అధికారుల మౌనం వెనుక మర్మమేమి ?**

ప్రతి సంవత్సరం ఫీజులు పెంచేందుకు అనుమతి ఎవరు ఇస్తున్నారు?
ఎన్ని పాఠశాలలు నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శిస్తున్నాయి?
ఎన్ని పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు?
ఈ ప్రశ్నలకు సమాధానాలు కనిపించడం లేదు.

**విద్య హక్కా... వ్యాపారమా..?**

రాజ్యాంగం ప్రతి చిన్నారికి విద్య హక్కు కల్పించింది. కానీ నేడు నాణ్యమైన విద్య సామాన్యుడికి అందని ద్రాక్షలా మారుతోంది. విద్య హక్కు నుంచి వ్యాపార వస్తువుగా మారిపోతున్న ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

**ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే...**

ఫీజుల నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ప్రతి పాఠశాల ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో బహిరంగపరచాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు కల్పించాలి.లేకపోతే పిల్లల భవిష్యత్తు కోసం కన్నవారు




**ఓ స్కూలు బాధ్యునికీ విద్యార్థి తండ్రి మధ్య సాగిన సంభాషణ ఇది...**

టీచర్ : గుడ్ మార్నింగ్ సార్.. రండి, కూర్చోండి. ఎలా ఉన్నారు?
తండ్రి : ఫైన్ మేడం.. మీరెలా ఉన్నారు..
టీచర్ : మన స్కూల్ గురించి తెలుసుకుని వచ్చారా..? లేక ఎవరైనా రిఫరెన్స్ ఉన్నారా.. ? సార్
తండ్రి : లేదు మేడం. మేం తెలుసుకునే వచ్చాం..
టీచర్ : గుడ్ సార్.. స్కూల్‌లో చేర్పించాలనుకున్నది పాపనా..? బాబునా..? సార్
తండ్రి : బాబును మేడం..
టీచర్ : వయస్సు ఎంత ఉంటుంది సార్..
తండ్రి : మూడు సంవత్సరాల ఏడు నెలలు మేడం..
టీచర్ : ఓకే.. అయితే నర్సరీలో చేర్పిద్దాం సార్.. ఇంకా ఏజ్ లేదు కదా.. ఎల్‌కేజీకి..
తండ్రి : ఓకే.. మేడం.. ఫీజు వివరాలు చెప్తారా..
టీచర్ : హ.. సరే సార్.. ముందుగా జాయినింగ్ ఫీజు.. 6వేలు.. అప్లికేషన్ ఫీజు.. 500 సార్. స్కూల్ ఫీజు వచ్చి 35,000, బుక్స్, యూనిఫాం, టై, బెల్టు, ఐడి కార్డు, పీటీ(స్పోర్ట్స్) డ్రస్స్ కలిపి 12,000 సార్. షూ బయట తీసుకోవాలి సార్. అందులో మీరు మాట్లాడుకుంటే స్కూల్ ఫీజు 30,000 చెయ్యవచ్చు సార్. మొత్తం రూ.50వేలు ఉంటుంది సార్.
తండ్రి : ఫీజు కొంచెం ఎక్కువే ఉన్నట్లుంది మేడం. ఇందులో ఇంకా ఏమైనా తగ్గించే అవకాశం ఉందా మేడం..
టీచర్ : లేదు సార్. మా స్కూల్లో ఇచ్చే క్వాలిటీ ఎడ్యుకేషన్, ఫెసిలిటీస్‌కి ఈ ఫీజు రీజనబుల్‌గానే ఉంటుంది. స్కూల్ ఫీజు విషయంలో మనం అంతకంటే తక్కువ చేయలేం. ఇక బాబుకి సంబంధించినవి బయట వాళ్లు ఇచ్చేవి. అందులో మనం మాట్లాడడానికి ఏం ఉండదు. సార్.
తండ్రి : ప్రస్తుతం మా బాబు జాయినింగ్‌కు ఎంత కట్టమంటారు..
టీచర్ : అప్లికేషన్ ఫీజు 500 సార్. ఇంక మీరు ఫీజు ఫైనల్ చేసుకుంటే అందులో కొంత కట్టవచ్చు. మిగతా అమౌంట్ డిసెంబర్ 31 వరకు డ్యూ లేకుండా చూడగలరు.
తండ్రి : ఓకే మేడం థ్యాంక్యూ...
టీచర్ : ఓకే సార్.. అప్లికేషన్ రాయమంటారా..! సార్..
తండ్రి : ఇప్పుడు వద్దులేండి.. మా మేడంను తీసుకుని వస్తా.. మళ్లీ..
టీచర్ : ఓకే సార్.. థ్యాంక్యూ..

# ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీకి కళ్లెం వేయాలి

## జీవో నెంబర్ 7ను రద్దు చేయాలి

## బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం



**వనపర్తి ప్రతినిధి, జూన్ 7 (నినాదం):** ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీకి కళ్లెం వేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో నెంబర్ 7 ను రద్దు చేయాలని బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం డిమాండ్ చేశారు. బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేష్ సూర్యవంశంను నియమించినట్లు బి.సి చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బి.సి చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాదులో బి.సి సాధికారత సంస్థ భవన్లో బి.సి చైతన్య వేదిక జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం మాట్లాడుతూ జీ.వో నెంబర్ 7ను అదునుగా చేసుకొని ఈ మధ్యకాలంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముందుగానే ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని అన్నారు. దీనికి అదనంగా పుస్తకాల ఫీజులు, అడ్మిషన్ ఫీజులని వేలకు వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని చెప్పారు. పూర్తిగా ఫీజులు కట్టలేని చాలామంది పేద విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలలోను ఉంచుకొని మానసిక వేదనకు, గురి చేస్తున్నారని, దీనివల్ల కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాల్ని మనం చూశామన్నారు. ప్రభుత్వానికి కళాశాల యాజమాన్యాలకు ఏమైనా అంతర్గత సమస్యలుంటే వారే చూసుకోవాలి కానీ అత్త మీది కోపం దుత్త మీద చూపించినట్టుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ లను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులే ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రైవేటు యాజమాన్యాల ఫీజు దోపిడీలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక పటిష్టమైన "ఫీ రెగ్యులేటరీ కమిటీ" లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఫీజు దోపిడీ వల్ల నష్టపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు వారి బాధను చెప్పుకోవడానికి ఒక్క హెల్ప్ లైన్ నెంబర్ కానీ, జిల్లాస్థాయిలో ఒక ఆఫీసు కానీ లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి ప్రైవేటు యాజమాన్యాల ఫీజు దోపిడీకి కళ్లెం వేయాలని, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తు ఆందోళనలతో ముడిపడిన సున్నితమైన అంశమని, ఇప్పటివరకు ఒత్తిడికి లోనై నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి పరీక్షల్లో లోపాలు జరగడం, లక్షలాది మంది విద్యార్థుల శ్రమ వృథా కావడం విద్యాశాఖ వైఫల్యమేనని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బి.సి విద్యార్థులకు రక్షణ కల్పించే కుల ఆధారిత వివక్షను నిర్మూలించడానికి, సమానత్వం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రవేశపెట్టిన 'ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ రెగ్యులేషన్స్, 2026'ను త్వరగా తీసుకురావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బి.సి చైతన్య వేదిక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా అక్కడి ప్రభుత్వం బి.సి రక్షణ ముసాయిదా చట్టాన్ని రూపొందించిందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా బి.సి వర్గాలు వివక్షతను ఎదుర్కొంటున్నారని, వారి కోసం బి.సి రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మేడిపల్లి గౌతమ్, ప్రధాన కార్యదర్శిగా బైకిని రమేష్, అధికార ప్రతినిధిగా నాతి శివరాజ్, కార్యదర్శిగా రెడ్డ మోని శ్రీశైలం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు టి.వినోద్ కుమార్, సలహాదారు మాదాసు రంగనాయకులు ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో బి.సి చైతన్య వేదిక జాతీయ సలహాదారు అక్కల బాబుగౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు సీమల శంకర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావు. మహిళ కార్యనిర్వాహక అధ్యక్షురాలు రేణుక దీదీ వాసం రాజేష్, పగిళ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.


**శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARPL)**
SHRIRAM Asset Reconstruction
(వివిధ SARC ట్రస్ట్‌ల ట్రస్టీగా హోదాలో వ్యవహరిస్తోంది)
నమోదిత కార్యాలయం: శ్రీరామ్ హౌస్, నం. 4, బర్కిట్ రోడ్, టి. నగర్, చెన్నై - 600017. కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నం. FF-A-05, A వింగ్ ।, మొదటి అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫీనిక్స్ మార్కెట్ సిటీ, LBS మార్గ్, కుర్లా (పశ్చిమ), ముంబై - 400070 వెబ్‌సైట్: www.shriramarc.com ఫోన్ నెం. 1800 120 2389 ; customercare@shriramarc.com.

**బహిరంగ ప్రకటన : స్థిరాస్తి/ల ఇ-వేలం మరియు అమ్మకపు ప్రకటన -**

అనుబంధం-4-ఎ ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6, 8 (6) మరియు 9 నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతలు/ హామీదారులు మరియు తనఖాదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, SARFAESI చట్టంలోని సెక్షన్ (5) ప్రకారం వివిధ SARPL ట్రస్ట్‌లకు ట్రస్టీ హోదాలో వ్యవహరిస్తున్న (రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ ఒప్పందాల ద్వారా ఆర్థిక ఆస్తుల అప్పగింతను అనుసరించి) సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇకపై SARPL గా సూచించబడును)కు తాకట్టు/ఛార్జ్ చేయబడిన ఈ క్రింద వివరించబడిన స్థిరాస్తులు, అసలు రుణదాత/ అసైనర్ అయిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (MHFL) నుండి ఇక్కడ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు తాకట్టుదారులతో సహా వివిధ రుణగ్రహీతలకు సంబంధించిన ఆర్థిక ఆస్తులను, వాటిపై సృష్టించబడిన అంతర్లీన సెక్యూర్డ్ ఆసక్తితో పాటు వాటిపై ఉన్న అన్ని హక్కులు, టైటిల్ మరియు వడ్డీ సహా స్వాధీనము చేసుకున్నాయి. ఈ ఆస్తుల భౌతిక స్వాధీనాన్ని అసలు రుణదాత/ అప్పగింత దారు మరియు/ లేదా శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి తీసుకున్నారు. SARC-ట్రస్ట్- 13 యొక్క ట్రస్టీ హోదాలో ఉన్న సెక్యూర్డ్ క్రెడిటార్ అనగా అసైనర్ మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా మంజూరు చేయబడి మరియు పంపిణీ చేయబడిన రుణము యొక్క అస్సైనీ, బకాయి ఉన్న మొత్తాన్ని దానిపై తదుపరి వడ్డీ, ఛార్జీలు, ఖర్చులు, వ్యయాలు, మొ॥ వాటితో సహా SARPL అనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)& రూల్ 9(1) యొక్క నిబంధన ప్రకారం పట్టికలో పేర్కొన్న విధంగా రుణగ్రహీత/ సహ రుణగ్రహీతలు మరియు తనఖాదారుల నుండి వసూలు చేయడం కొరకు క్రింద పేర్కొన్న వేలము షెడ్యూల్ ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికన అమ్మబడుతుంది. రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు తనఖాదారుల వివరాలు చెల్లించవలసిన మొత్తం, స్థిరాస్తి/ల సంక్షిప్త వివరణ మరియు వాటిపై తెలిసిన ఏవైనా రుణభారాలు, రిజర్వు ధర, బయానా, బిడ్డు పెంపుదల వేలము తేదీ మరియు తనిఖీ తేదీ కూడా క్రింద ఇవ్వబడినవి.

| క్ర. సం. | రుణ ఖాతా నెం. ట్రస్ట్ పేరు & హక్కు బదిలీదారు పేరు/ అసలు రుణదాత పేరు | రుణగ్రహీతలు /సహ-రుణగ్రహీతలు /హామీదారులు /తనఖాదారుల పేరు | 13(2) డిమాండ్ నోటీసు మరియు స్వాధీనానికి సంబంధించిన తేదీ & మొత్తం | రిజర్వు ధర, బయానా, బిడ్ పెంపుదల, బిడ్డు ఫారం దాఖలుకు చివరి తేదీ | వేలము మరియు తనిఖీ తేదీ & సమయం | సంప్రదించు వ్యక్తి వివరాలు- ఏఓ మరియు సర్వీస్ ప్రొవైడర్ |
|---|---|---|---|---|---|---|
| 1 | ___MHL01110022196 & NVAP0111022195 మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో ట్రస్ట్ అకౌంట్ నెం. SARC Trust-13 | వేముల లక్ష్మీ, వేముల రమేష్, రాజు సూర | 20.12.2024 నాటికి బకాయిలు రూ. 512754/- (రూపాయలు ఐదు లక్షల పన్నెండు వేల ఏడు వందల యాభై నాలుగు మాత్రమే) మొత్తానికి నోటీసు తేదీ 20.12.2024 స్వాధీనతా రకం & తేదీ : భౌతిక స్వాధీనము & 18.04.2026 | రిజర్వు ధర : రూ. 720864/- బిడ్డు పెంపుదల : రూ.10,000/- & అట్టి గుణాంకాలు, బయానా మొత్తం : రూ. 72086/- (ఆర్‌పిలో 10%) బయానా దాఖలుకు చివరి తేదీ మరియు సమయం 09.07.2026న ఉ.11.30 గం.ల నుండి సా.05.30 గం.ల వరకు | వేలము తేదీ & సమయం : 10.07.2026న ఉ.11.30 గం.ల నుండి మ.2.30 గం.లకు వరకు. తనిఖీ తేదీ : 16.06.2026 & సమయం : ఉ.11.30 గం.ల నుండి సా.5.30 గం.ల వరకు ఎంహెచ్‌ఎఫ్‌ఎల్/ ఎస్ఎఆర్‌పిఎల్‌కు తెలిసిన తాకట్టు రుణ బకాయిలు లేవు. | సుమేష్ మిట్టల్ 9993587797 రాంపాల్ గౌతం 9625977792 ప్రతీక్ కస్తూరి 8108844344 పవార్ సుగుణాకర్ వెంకటేష్ 9912272334 |

తనఖా పెట్టిన ఆస్తి/ల వివరణ : తెలంగాణ, పిన్-503165, నిజామాబాద్, పి.ఓ. సిరికొండ, ఎస్ఆర్ఓ భీంగల్, నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రామడుగు గ్రామం వద్ద మొత్తం సైట్ ఏరియా = (40-6"×22-3")-(901.12) చ.అ.లు, లేదా (100.12) చ.గ.లు లేదా (83.71) చ.మీ.ల బిల్టప్ ఏరియా, రూఫ్ (315.79) చ.అ.ల విస్తీర్ణంతో జి.పి.నెం.(2-162) గల ఇంటి విస్తీర్ణంతో తనఖా పెట్టిన ఆస్తి యావత్తు. సరిహద్దులు : తూర్పు : వేముల రాజేశ్వర్ ఖాళీ ప్రదేశం, పడమర : సిరికొండ నుండి కామారెడ్డి మెయిన్ రోడ్, దక్షిణం : ఉమ్మడి మార్గం, ఉత్తరం : రాజకిషన్ ఇల్లు.

1) అమ్మకము యొక్క వివరమైన నియమనిబంధనలు : బిడ్ ఫారం & ఇతర వాటి కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్/ అస్సైనీ/ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ : https://www.shriramarc.com లేదా మా వేలం ఏజెన్సీ వెబ్‌సైట్ : https://sarfaesi.auctiontiger.net ను కూడా దర్శించగలరు. కార్యాలయం చిరునామా : ప్రధాన కార్యాలయం, బి-705 వాల్ స్ట్రీట్-2, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజీ దగ్గర, ఎల్లిస్ బ్రిడ్జి, అహ్మదాబాద్- 380006, గుజరాత్ (ఇండియా). ఏదేని సహాయం కొరకు ఇ-మెయిల్ ఐడి : bhhospete@manappuramhomefin.com కు ఇ-మెయిల్ చేయగలరు. లేదా మా బిజినెస్ పార్ట్‌నర్ మెస్సర్స్ మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిని పైన తెలిపిన పట్టికలో ఇవ్వబడిన నెం.లను సంప్రదించగలరు. బిడ్ ఫారంతో పాటు బిడ్డర్లచే నిబంధనలు సంతకం చేయబడాలి. ప్రస్తుత ప్రకటన అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడుతుంది. (2) టి2.SARCTRUST-13 and RTGS/NEFT in SARC-TRUST-13; Bank Name: ICICI Bank Limited; Branch Address: Mumbai - Kamani Kurla West; Bank Account Number: 196205004629/ 196205004652; IFCL Code- ICIC0001962 పేరున కాగోరు బిడ్డరు వారి బయానా మొత్తాన్ని డిడి రూపంలో దాఖలు చేయాలి. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకము ప్రకటన. రుణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు ఇ-వేలము తేదీలోగా అప్ డేట్ అయిన వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన విధంగా మొత్తాన్ని చెల్లించాలని సూచించడమైనది, లేనిచో ఏవేని మిగులు బకాయిలు ఉంటే ఆస్తి వేలము వేయబడును/ అమ్మబడును వడ్డీ, వ్యయాలతో రికవరీ చేయబడుతాయి.

సం/- అధీకృత అధికారి, మెస్సర్స్ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ SARC ట్రస్ట్‌ల ట్రస్టీగా హోదాలో వ్యవహరిస్తోంది

ప్రదేశం : తిరుమల టాకీస్ క్రాస్ రోడ్, తేదీ : 08.06.2026


# ప్రభుత్వ రహదారిపై ప్రైవేటు పెత్తనం?

## బొజ్జగూడెం--ఖానాపురం మార్గం బ్లాక్..

## అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**కోదాడ,జూన్ 7(నినాదం):** అనంతగిరి మండలం బొజ్జగూడెం తండ నుంచి అజ్మీరా తండ, ఖానాపురం గ్రామాలకు వెళ్లే ప్రభుత్వ రహదారిని ఓ వ్యక్తి అడ్డుకోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుగులోతు సక్రు అనే వ్యక్తి రహదారిని తన భూమిగా పేర్కొంటూ రాకపోకలను అడ్డుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.గతంలో ఇదే తరహాలో నాలుగైదు సార్లు రహదారిని మూసివేయగా, పెద్దల జోక్యంతో సమస్యను పరిష్కరించినట్లు గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ సదరు వ్యక్తి మళ్లీ రహదారిని బ్లాక్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ రహదారిపై అక్రమంగా అడ్డంకులు సృష్టిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రజలకు నిరంతర రాకపోకలు కల్పించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.ప్రజా అవసరాలకు కీలకమైన రహదారులపై వ్యక్తిగత హక్కులు చెలాయించే ప్రయత్నాలను అరికట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# 32 ఏళ్లకే పెద్ద చెరువు మత్స్య సహకార సంఘం అధ్యక్ష పదవి

## పోరాట పటిమకు పట్టం కట్టిన సభ్యులు

## నాగేంద్రబాబుకు ముందున్న సవాళ్లు ఎన్నో!



**కోదాడ, జూన్ 7(నినాదం):** కోదాడ పెద్ద చెరువు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా యువకుడు శీలం నాగేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేవలం 32 ఏళ్ల వయసులోనే ఈ బాధ్యతలు చేపట్టడం విశేషంగా మారింది. పెద్ద చెరువు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సభ్యుల మద్దతు పొందిన ఆయనకు సంఘ సభ్యులు ఏకగ్రీవంగా పట్టం కట్టారు.చెరువు అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం, సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం నాగేంద్రబాబు చేసిన కృషిని గుర్తించిన సభ్యులు ఆయన నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

**సవాలను ఎదుర్కోవాలి... సమస్యలు పరిష్కరించాలి!**
అయితే అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాగేంద్రబాబుకు సవాళ్లు కూడా తక్కువగా లేవు. ఒకప్పుడు 700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న కోదాడ పెద్ద చెరువు పరిధిలోని భూముల్లో గణనీయమైన భాగం కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై గత కొన్ని ఏళ్లుగా మత్స్యకార సంఘ సభ్యులు, సామాజిక ఉద్యమకారులు పోరాటాలు కొనసాగిస్తున్నారు. చెరువు చుట్టూ ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం, చెరువు హక్కులను పరిరక్షించడం నూతన అధ్యక్షుడి ముందున్న ప్రధాన సవాల్‌గా మారింది. చెరువు పరిరక్షణ కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

**చెరువు పరిరక్షణకు కృషి చేస్తా!**



శీలం నాగేంద్రబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధితో పాటు చెరువుకు సంబంధించిన సమస్యల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు కోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. పెద్ద చెరువు పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.


**శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARPL)**
SHRIRAM Asset Reconstruction
(వివిధ SARC ట్రస్ట్‌ల ట్రస్టీగా హోదాలో వ్యవహరిస్తోంది)
నమోదిత కార్యాలయం: శ్రీరామ్ హౌస్, నం. 4, బర్కిట్ రోడ్, టి. నగర్, చెన్నై - 600017. కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నం. FF-A-05, A వింగ్ ।, మొదటి అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫీనిక్స్ మార్కెట్ సిటీ, LBS మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబై - 400070 వెబ్‌సైట్: www.shriramarc.com ఫోన్ నెం. 1800 120 2389 ; customercare@shriramarc.com.

**బహిరంగ ప్రకటన : స్థిరాస్తి/ల ఇ-వేలం మరియు అమ్మకపు ప్రకటన -**

అనుబంధం-4-ఎ ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6, 8 (6) మరియు 9 నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతలు/ హామీదారులు మరియు తనఖాదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, SARFAESI చట్టంలోని సెక్షన్ (5) ప్రకారం వివిధ SARPL ట్రస్ట్‌లకు ట్రస్టీ హోదాలో వ్యవహరిస్తున్న (రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ ఒప్పందాల ద్వారా ఆర్థిక ఆస్తుల అప్పగింతను అనుసరించి) సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇకపై SARPL గా సూచించబడును)కు తాకట్టు/ఛార్జ్ చేయబడిన ఈ క్రింద వివరించబడిన స్థిరాస్తులు, అసలు రుణదాత/ అసైనర్ అయిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (MHFL) నుండి ఇక్కడ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు తాకట్టుదారులతో సహా వివిధ రుణగ్రహీతలకు సంబంధించిన ఆర్థిక ఆస్తులను, వాటిపై సృష్టించబడిన అంతర్లీన సెక్యూర్డ్ ఆసక్తితో పాటు వాటిపై ఉన్న అన్ని హక్కులు, టైటిల్ మరియు వడ్డీ సహా స్వాధీనము చేసుకున్నాయి. ఈ ఆస్తుల భౌతిక స్వాధీనాన్ని అసలు రుణదాత/ అప్పగింత దారు మరియు/ లేదా శ్రీరామ్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి తీసుకున్నారు. SARC-ట్రస్ట్- 13 యొక్క ట్రస్టీ హోదాలో ఉన్న సెక్యూర్డ్ క్రెడిటార్ అనగా అసైనర్ మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా మంజూరు చేయబడి మరియు పంపిణీ చేయబడిన రుణము యొక్క అస్సైనీ, బకాయి ఉన్న మొత్తాన్ని దానిపై తదుపరి వడ్డీ, ఛార్జీలు, ఖర్చులు, వ్యయాలు, మొ॥ వాటితో సహా SARPL అనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)& రూల్ 9(1) యొక్క నిబంధన ప్రకారం పట్టికలో పేర్కొన్న విధంగా రుణగ్రహీత/ సహ రుణగ్రహీతలు మరియు తనఖాదారుల నుండి వసూలు చేయడం కొరకు క్రింద పేర్కొన్న వేలము షెడ్యూల్ ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికన అమ్మబడుతుంది. రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు తనఖాదారుల వివరాలు చెల్లించవలసిన మొత్తం, స్థిరాస్తి/ల సంక్షిప్త వివరణ మరియు వాటిపై తెలిసిన ఏవైనా రుణభారాలు, రిజర్వు ధర, బయానా, బిడ్డు పెంపుదల వేలము తేదీ మరియు తనిఖీ తేదీ కూడా క్రింద ఇవ్వబడినవి.

| క్ర. సం. | రుణ ఖాతా నెం. ట్రస్ట్ పేరు & హక్కు అసైనర్ పేరు/ అసలు రుణదాత పేరు | రుణగ్రహీతలు /సహ-రుణగ్రహీతలు /హామీదారులు /తనఖాదారుల పేరు | 13(2) డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం మరియు స్వాధీనానికి సంబంధించిన వివరాలు | రిజర్వు ధర, బయానా, బిడ్ పెంపుదల, బిడ్డు ఫారం దాఖలుకు చివరి తేదీ | వేలము మరియు తనిఖీ తేదీ & సమయం | సంప్రదించు వ్యక్తి వివరాలు- ఏఓ మరియు సర్వీస్ ప్రొవైడర్ |
|---|---|---|---|---|---|---|
| 1 | ___NVAP0072039018 & MHL00720039019 మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో ట్రస్ట్ అకౌంట్ నెం. SARC Trust-13 | తాండ్ర సుగుణ తాండ్ర అశోక్ | 20.05.2025 నాటికి బకాయిలు రూ. 735250/- (రూపాయలు ఏడు లక్షల ముప్పై ఐదు వేల రెండు వందల యాభై మాత్రమే) మొత్తానికి నోటీసు తేదీ 20.05.2025 స్వాధీనతా రకం & తేదీ : భౌతిక స్వాధీనము & 28.03.2026 | రిజర్వు ధర : రూ. 1357562/- బిడ్డు పెంపుదల : రూ.10,000/- & అట్టి గుణాంకాలు, బయానా మొత్తం : రూ. 135756/- (ఆర్‌పిలో 10%) బయానా దాఖలుకు చివరి తేదీ మరియు సమయం 09.07.2026న ఉ.11.30 గం.ల నుండి సా.05.30 గం.ల వరకు | వేలము తేదీ & సమయం : 10.07.2026న ఉ.11.30 గం.ల నుండి మ.2.30 గం.లకు వరకు. తనిఖీ తేదీ : 16.06.2026 & సమయం : ఉ.11.30 గం.ల నుండి సా.5.30 గం.ల వరకు ఎంహెచ్‌ఎఫ్‌ఎల్/ ఎస్ఎఆర్‌పిఎల్‌కు తెలిసిన తాకట్టు రుణ బకాయిలు లేవు. | సుమేష్ మిట్టల్ 9993587797 రాంపాల్ గౌతం 9625977792 ప్రతీక్ కస్తూరి 8108844344 కన్నెబోయిన పూర్ణ చందర్ 9642097321 |

తనఖా పెట్టిన ఆస్తి/ల వివరణ : తెలంగాణ, పిన్-506132, వరంగల్, నర్సంపేట్ పోస్ట్, వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం, నర్సంపేట్ రెవెన్యూ గ్రామం వద్ద గల వార్డు నెం. 6లో 347.71 చ.అ.ల ఏసిసి ప్లింత్ ఏరియా, 98.66 చ.గ.లు, లేదా 82.49 చ.మీ.ల విస్తీర్ణంతో ఇం.నెం.6-63/32ఏ గల ఖాళీ ప్రదేశంతో ఏసిసి రూఫ్ హౌస్‌తో తనఖా పెట్టిన ఆస్తి యావత్తు. సరిహద్దులు : తూర్పు : రూపిక సమ్మయ్య ఖాళీ ప్రదేశం, పడమర : మున్సిపల్ రోడ్, దక్షిణం : అర్మం కృష్ణ ఇల్లు & ఖాళీ ప్రదేశం, ఉత్తరం : సుంకరి రాజమ్మ ఇల్లు & ఖాళీ ప్రదేశం.

1) అమ్మకము యొక్క వివరమైన నియమనిబంధనలు : బిడ్ ఫారం & ఇతర వాటి కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్/ అస్సైనీ/ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ : https://www.shriramarc.com లేదా మా వేలం ఏజెన్సీ వెబ్‌సైట్ : https://sarfaesi.auctiontiger.net ను కూడా దర్శించగలరు. కార్యాలయం చిరునామా : ప్రధాన కార్యాలయం, బి-705 వాల్ స్ట్రీట్-2, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజీ దగ్గర, ఎల్లిస్ బ్రిడ్జి, అహ్మదాబాద్- 380006, గుజరాత్ (ఇండియా). ఏదేని సహాయం కొరకు ఇ-మెయిల్ ఐడి : bhhospete@manappuramhomefin.com కు ఇ-మెయిల్ చేయగలరు. లేదా మా బిజినెస్ పార్ట్‌నర్ మెస్సర్స్ మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిని పైన తెలిపిన పట్టికలో ఇవ్వబడిన నెం.లను సంప్రదించగలరు. బిడ్ ఫారంతో పాటు బిడ్డర్లచే నిబంధనలు సంతకం చేయబడాలి. ప్రస్తుత ప్రకటన అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడుతుంది. (2) టి2.SARCTRUST-13 and RTGS/NEFT in SARC-TRUST-13; Bank Name: ICICI Bank Limited; Branch Address: Mumbai - Kamani Kurla West; Bank Account Number: 196205004629/ 196205004652; IFCL Code- ICIC0001962 పేరున కాగోరు బిడ్డరు వారి బయానా మొత్తాన్ని డిడి రూపంలో దాఖలు చేయాలి. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకము ప్రకటన. రుణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు ఇ-వేలము తేదీలోగా అప్ డేట్ అయిన వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన విధంగా మొత్తాన్ని చెల్లించాలని సూచించడమైనది, లేనిచో ఏవేని మిగులు బకాయిలు ఉంటే ఆస్తి వేలము వేయబడును/ అమ్మబడును వడ్డీ, వ్యయాలతో రికవరీ చేయబడుతాయి.

సం/- అధీకృత అధికారి, మెస్సర్స్ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ SARC ట్రస్ట్‌ల ట్రస్టీగా హోదాలో వ్యవహరిస్తోంది

ప్రదేశం : వరంగల్, తేదీ : 08.06.2026


# తండాల అభివృద్ధికై కృషి చేస్తాను..

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చూస్తాను

## సర్పంచ్ బోడ భద్రు నాయక్



**డోర్నకల్/మరిపెడ, జూన్ 07(నినాదం):** మరిపెడ మండలం రూప్ సింగ్ తండ గ్రామ పంచాయితీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభను సర్పంచ్ బోడ భద్రు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామాభివృద్ధి,ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ఈ సభ ముఖ్య ఉద్దేశమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భద్రు నాయక్ మాట్లాడుతూ...ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే తమ తొలి ప్రాధాన్యత అన్నారు.తండాలో ఉన్న సమస్యలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని తెలిపారు.ఇందుకోసం నిధులు మంజూరు చేయించి,పనులను వేగవంతం చేస్తామని తండావాసులకు హామీ ఇచ్చారు.తండాలోని ప్రజలు గ్రామపంచాయతీ అభివృద్ధికై సహకరించాలని కోరారు.తడి పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు,మహిళా సంఘాల నాయకులు,గ్రామ పెద్దలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు.

# స్కూల్ రీఓపెన్ వేళ.. తీరని గదుల కొరత!





## ఖానాపురంలో మధ్యలోనే నిలిచిపోయిన గదుల నిర్మాణం

## ఏండ్లు గడుస్తున్న తీరని సమస్య!

**కోదాడ, జూన్ 7(నినాదం):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు నేటికీ పూర్తికాకపోవడంతో పాఠశాలలో గదుల కొరత సమస్య కొనసాగుతోంది.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి సమయం ఆసన్నమైనప్పటికీ నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడం తల్లిదండ్రులు, గ్రామస్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు విద్యార్థుల సంఖ్యకు సరిపోకపోవడంతో బోధన, అభ్యాస ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.ప్రభుత్వం విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పంటల వ్యర్థాలను తగలబెడితే మానవాళికే నష్టం



**కమలాపూర్ ,జూన్ 7 (నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లో పంటల వ్యర్థాలను తగలబెడితే మానవాలికే నష్టం అని స్థానిక ఎస్సై దిలీప్ అన్నారు. ఆదివారం మండలంలోని వంగపల్లి గ్రామంలో పంట వ్యర్థాలను తగలపెట్టారనే సమాచారం మేరకు అక్కడకు చేరుకొని మంటలను ఆర్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండుటెండలు, వడ గాలులు ఒక వైపు, మనం పెట్టే మంటలు గ్రామాల శివార్లలోని వందల ఎకరాల్లో మంటలు చెలరేగి ఊర్లకు వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామంలో నోరు లేని ఎన్నో మూగజీవాలు, మన నోట్లోకి బుక్క రావడానికి ఎనలేని సాయం చేసిన ఎన్నో సూక్ష్మ జీవులు, ఎంతో మంది రైతుల మోటార్లు, గుడిసెలు, విలువైన ఆస్తులు, మన తండ్రులు, తాతలు, పెద్దలు ఎంతో మురిపెంగా నాటిన పచ్చని చెట్లు, మనల్ని భరిస్తున్న భూదేవి అన్నీ బుగ్గిపాలు అయితయాని అన్నారు.భూతల స్వర్గాన్ని బుగ్గిపాలు చేస్తే మన ముందు తరాలు మిగలవన్నారు. ఈ మంటలు పెట్టే సంస్కృతిని వెంటనే ఆపుదాం.ఎంత తిప్పలైనా పడుదాం కానీ నిప్పు పెట్టే ఉపాయాలు మానుదాంఅని తెలిపారు. ఎనుకట ఈ పనులు మన రైతన్నలు చెయ్యలేదు, ఒకప్పటి లెక్క పల్లెల్లో చల్లదనం కరువైంది, చక్కటి గాలి కూడా నాశనమైంది. దీనికంతటికీ ఒకే ఒక్క కారణం మనం చేసే ఈ పొలాల్లో మంటలు వ్యాపిస్తే ఫైర్ ఇంజన్లో వచ్చే పరిస్థితి లేదన్నారు. నా రైతన్నలారా,అక్కలారా మీ ఇష్ట దైవం మీద ఒట్టేసి ఇకనుండి మశీటలు పెట్టను, పెట్టనివ్వనని మాటివ్వండని కోరారు. ఈ భూమి మీద జీవించే హక్కు అందరికీ వుంది అందులో ప్రతీ జీవి వుంటుంది. స్వచ్ఛమైన గాలి, నీరు వాతావరణం దక్కేలా ప్రతీ ఒక్కరం తిప్పలపడాలి.పంట కోసేటప్పుడు కిందివరకు కొయ్యమనిజ్ హార్వెస్టర్ లకు చెప్పాలని రైతులను కోరారు.

# జాతీయ మాలల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక



**అమరచింత, జూన్ 7, (నినాదం):** జాతీయ మాలల ఐక్యవేదిక అమరచింత మండలం నూతన కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షులు మాదారి భోజరాజు అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాదారి భోజరాజు మాట్లాడుతూ జిల్లాలో మాలల హక్కుల కోసం జిల్లా కమిటీ తరపున నిరంతరం కృషి చేస్తామని అన్నారు. అధ్యక్షులుగా వీద విష్ణువర్ధన్ ఉపాధ్యక్షులుగా వీద రవి, లింగమొల్ల రమేష్, ప్రధాన కార్యదర్శి వీద భార్గవ్, కోశాధికారి రామస్వామి, కార్యదర్శులు పెరుగు రాజశేఖర్, వీద రాఘవేంద్ర, సహాయ కార్యదర్శులుగా నరేష్ కుమార్, ప్రశాంత్, సోషల్ మీడియా ఇన్చార్జిగా పవన్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా గౌరవ అధ్యక్షులుగా కేశవ వెంకటస్వామి, వీద నవీన్ కుమార్ లు, గౌరవ సలహాదారులుగా వీద వెంకట్రాములు, పెరుగు వెంకట్రాములు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా బాపనపల్లి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల కరుణాకర్, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారం





- సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తాం
- నూతన అధ్యక్షుడు బత్తెపు శేఖర్

**వలిగొండ, జూన్ 07 (నినాదం):** మండలంలోని వెలువర్తి గ్రామంలో ఏడు సంవత్సరాల తర్వాత నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలలో గెలుపొందిన పాలక వర్గానికి ఆదివారం ఎన్నికల అధికారి కుర్ర సురేష్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో నూతన అధ్యక్షుడిగా బత్తేపు శేఖర్, ఉపాధ్యక్షుడిగా మారబోయిన పరుశురాం, కార్యదర్శిగా సురబోయిన దయాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా నిమ్మల శేఖర్, దుడ్డు ఆంజనేయులు, బొల్లెబోయిన శేఖర్, మారబోయిన అంజయ్య, దుడ్డు అండాలు, చెవ్వ ఎల్లమ్మలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించినందుకు సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేసి ముందు వరుసలో నిలుపుతామని వారు తెలియజేశారు.ముదిరాజ్ సమాజ సంక్షేమం, అభివృద్ధి, ఐక్యత మరియు సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం నూతన నాయకత్వం కృషి చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా "నియంతృత్వ పాలనకు ముగింపు ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిన వెలువర్తి ముదిరాజ్ ఐక్యత" అనే నినాదంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, చెవ్వ కృష్ణ, చెవ్వ బిక్షపతి, మారబోయిన బిక్షపతి, సారగండ్ల రాజు, దుడ్డు రమేష్, కాల్వల లింగస్వామి, చెవ్వ మధు, దాసబోయిన వెంకటేశం, దుడ్డు నవీన్, బొల్లబోయిన మధు, నిమ్మల సురేష్, నిమ్మల నవీన్, దుడ్డు గణేష్, బొల్లబోయిన వంశీ, మారబోయిన అనిల్, సారగండ్ల ఉదయ్ ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ హాస్పిటల్స్ పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ జూన్ 7 (నినాదం):** కార్పొరేట్ హాస్పిటల్స్ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో ఈఎస్ఐ (జూ×) సేవల కౌంటర్ ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారికి అత్యాధునిక కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఈ సరికొత్త ఈఎస్ఐ కౌంటర్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గతంలో ఈఎస్ఐ సేవల కోసం కార్మికులు హైదరాబాద్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మిర్యాలగూడ పట్టణంలోనే అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో ఏర్పాటుతో స్థానికంగానే తక్షణ అత్యవసర వైద్యం అందుతుందని అన్నారుఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు రూపాయి ఖర్చు లేకుండా ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలు పొందవచ్చు అన్నారు.. ఈ సదుపాయాన్ని మిర్యాలగూడ ప్రాంతంలోని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, హాస్పిటల్ మేనేజ్మెంట్ ప్రతినిధులు, ప్రముఖ డాక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లుగా నిరాశ్రయం.. వికలాంగురాలి గోడు పట్టదా?

**ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి మంత్రిగారూ..**
**కూసుమంచి జక్కేపల్లి ఎస్సీ కాలనీలో సంగెం చంద్రమ్మ ఆవేదన..**
**గాలి దుమ్ములకు కూలిన గూడు.. కట్టుకోలేక నిస్సహాయత**



**పాలేరు, జూన్7(నినాదం):** భర్త చనిపోయి ఇరవై ఏళ్లు. నేను వికలాంగురాలిని. కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే ఇల్లు వస్తుందని గుడ్డి నమ్మకంతో బతికాం. కానీ ఇప్పటికీ మేం రోడ్డునే" అంటూ కూసుమంచి మండలం జక్కేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 58 ఏళ్ల సంగెం చంద్రమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. చంద్రమ్మకు ఒక కొడుకు, ఒక కూతురు. భర్త చనిపోయినప్పటి నుండి వికలాంగ పింఛన్, కూలి పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.మాకు సెంటు భూమి కూడా లేదు సార్. ఉన్నది ఒక పూరి గుడిసె. అది కూడా గత వర్షాకాలంలో గాలి దుమ్ములకు పూర్తిగా కురిసిపోయింది" అని చెప్పింది.ఇల్లు కట్టుకుందామని కూలగొట్టి.. ఎలాగైనా కొత్త ఇల్లు కట్టుకోవాలని అప్పు సప్పు చేసి పాత గుడిసెను కూలగొట్టాం. కానీ సిమెంట్, ఇసుక రేట్లు ఆకాశానికి అంటాయి. కట్టుకునే స్తోమత లేక ఇప్పుడు బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నాం అంటూ తన దీనస్థితిని వివరించింది.రాజకీయ నాయకులు మమ్మల్ని పట్టించుకోరు. గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నా, తన దరఖాస్తు మాత్రం ముందుకు కదలడం లేదని చంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఊర్లో రాజకీయ నాయకులు మా వైపు కన్నెత్తి కూడా చూడట్లేదు. ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ, గ్రామ సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాను. 'వస్తుంది, వస్తుంది' అంటారే తప్ప ఇప్పటివరకు దిక్కులేదు" అని వాపోయింది.

**మంత్రికి విజ్ఞప్తి. ..**

మంత్రి గారు మీరైనా కనికరించండి. నేను వికలాంగురాలిని. నా కొడుకు, బిడ్డ భవిష్యత్తు కోసమైనా తలదాచుకునేందుకు ఒక ఇల్లు ఇప్పించండి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాకు న్యాయం చేయండి" అంటూ పాలేరు నియోజకవర్గ మంత్రికి, జిల్లా కలెక్టర్కు చంద్రమ్మ చేతులెత్తి వేడుకుంటోంది.

**ఇందిరమ్మ ఇళ్లు - లక్ష్యం ఏంటి?**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని నిరుపేదలకు, వికలాంగులకు, వితంతువుల కు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. అయినప్పటికీ చంద్రమ్మ లాంటి అర్హులకు ఇప్పటికీ ఇళ్లు దక్కకపోవడం గమనార్హం.

# అధిక ధరలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై... కళాజాత కార్యక్రమాలు

**జవహర్ నగర్ లో ప్రజానాట్యమండలి జిల్లా కౌన్సిల్ సమావేశం**
**జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు వై. నాగేశ్వరరావు**



**జవహర్నగర్, జూన్7 (నినాదం):** అధిక ధరలు మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై కళాజాత కార్యక్రమాలు రూపొంది స్తామని మేడ్చల్ జిల్లా ప్రజానాట్య మండలి గౌరాధ్యక్షులు వై నాగేశ్వర రావు పేర్కొన్నారు. మల్కాజి గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో తెలంగాణ ప్రజానాట్య మండలి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం కె. ప్రమీల ఆధ్వ ర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా తెలంగాణ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు వై. నాగేశ్వరరావు హాజరై మాటా ్లడుతూ నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై నేడు జరుగు తున్న రాజకీయ పరిణామాలపై ముఖ్యం గా అధిక ధరలు మహిళలపై జరు గుతున్న అఘాయిత్యాలపై కళాజాత కార్యక్రమాలు రూపొంది స్తున్నా మని తెలిపారు. ముఖ్యంగా యువ తపై మత్తుమందుల ప్రభావం తది తర అంశాలపై కళారూపాలు త యారు చేస్తామని తెలిపారు. జూలై నెల మొదటి వారంలో జిల్లా స్థాయి పాటలు నాటికలు శిక్షణ శిబిరాలు జవహర్ నగర్ లో నిర్వహిస్తా_మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి. వెంకటాచారి, అధ్యక్షురాలు ప్రమీల, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షులు రాములు, నరసమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 14న ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య

# రచించిన నవల "లంద" ఆవిష్కరణ

**హాజరుకానున్న పలువురు సాహితీ ప్రముఖులు**



**సిద్దిపేట ప్రతినిధి జూన్ 7(నినాదం):** సిద్దిపేట జిల్లా కు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య రచించిన " లంద " నవల ఆవిష్కరణ సభ హైదరాబాద్ లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కార్యక్రమ ఆహ్వాన పత్రికను మరసం ప్రతిని ధులు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా మంజీ రా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగా చార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి . తిరుపతి రెడ్డి, నవల రచయిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య, మరసం ఉపాధ్యక్షులు అలాజ్ పూర్ శ్రీనివాస్, నందిని భగవాన్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత పప్పుల రాజిరెడ్డి, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గంభీర్రావు పేట యాదగిరి,మాదిగ దండోరా ప్రతినిధులు పెదమాతరి బాబు మాదిగ, రాజమల్లు మాదిగ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 ఆదివారం రోజున హైదరాబాద్ లో "లంద " నవల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. రవీంద్రభారతి మినీ హాల్ లో మధ్యాహ్నం 1:30 గంటలకు సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిధి గా ప్రఖ్యాత కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరవుతారని విశిష్ట అతిధిగా శాసన మండలి సభ్యులు, ప్రముఖ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, లంద నవల పుస్తక ఆవిష్కర్త గా ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ కవి, రచయిత ప్రొఫెసర్ కాశీం, ప్రధాన వక్తగా ప్రముఖ రచయిత విమర్శకులు జి.లక్ష్మీ నరసయ్య, ఆత్మీయ అతిధులుగా ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, ప్రముఖ కవి రచయిత,కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, పర్స్పేక్టివ్ ఆర్. కె. ప్రముఖ కవి, రచయిత తైదల అంజయ్య, ప్రముఖ కవి, రచయిత సుద్దెంకి యాదగిరి, కవి రచయిత బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో మాదిగ సామాజిక వర్గాల జీవితం ప్రధాన అంశం గా రచయిత పొన్నాల బాలయ్య "లంద " నవల రచించాడని తెలిపారు.. తెలుగు సాహిత్య ప్రపంచం లో లంద నవల తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందని తెలిపారు. ఈ నవల ఆవిష్కరణ సభ కు సిద్దిపేట జిల్లా నుండి, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి పెద్దఎత్తున సాహితీ ప్రియులు హాజరు కావాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# నిత్యావసర ధరల పెంపుతో... ప్రజా జీవితం సంక్షోభంలోకి

**విద్యా వైద్యం రవాణా మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం**
**ఈనెల 10వ తారీఖున చలో మేడ్చల్ కలెక్టరేట్**
**జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీసు ముందు గోడ పత్రిక ఆవిష్కరణ**
**సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్**



**జవహర్నగర్, జూన్7 (నినాదం):** నిత్యావసర ధరల పెంపుతో ప్రజా జీవితం తీవ్ర సంక్షోభంలోకి వెళుతోందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని తప్పితే ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్ దుయ్యబట్టారు. నిత్యావసర ధరల పెంపును నిరసిస్తూ ఈనెల 10వ తేదీన మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలుపుతూ సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జవహర్ నగర్లో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ విద్యుత్ చార్జీలు విద్యా వైద్యం ఖర్చులు రోజురోజుకు పెరుగుతూ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయని ఈ విధానాలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 10వ తేదీన మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతోందని మరోవైపు ధరలు ఆకాశాన్ని అంటుతూ ఉన్నాయన్నారు. సాధారణ కుటుంబం నెల వారి ఖర్చులు భరించలేని పరిస్థితికి చేరు కొన్నాయన్నారు. బియ్యం పప్పులు కూరగాయలు వంటనూనె గ్యాస్ సిలిండర్ పాల ధరలు పెరుగుతుండడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అచ్చే దిన్ లు వస్తాయని చెప్పిన పాలకులు ప్రజలు ఇప్పుడు అప్పుల పాలుకు చేరుకున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్య ప్రజలకు అందని స్థాయికి చేరుకున్నాయని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఈ విధంగా నష్టపోతున్నారని తెలిపారు. వినియోగదారులకు మాత్రం అధిక ధరలకు ఎందుకు అమ్ముతున్నారని నిలదీశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ధరలను కూడా నియంత్రించక లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యా వైద్యం రవాణా వంటి మౌలిక సేవలు సామాన్యులకు భారంగా మారడానికి కారణమైన ప్రభుత్వాలు తమ విధి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యాయి అని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారుతున్న పాలకులు ప్రచార అర్బాటాలు మాత్రం కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. ఇకనైనా పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని పేద మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీన ఉదయం 11 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు కార్మికులు రైతులు యువత మహిళలు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు ,సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, ఏఐటిసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసులు జయమ్మ, డి. మల్లిక, సిహెచ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల హక్కుల సాధనకై ఐక్య పోరాటం చేద్దాం

**తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అవిలయ్య**





**జవహర్ నగర్, జూన్7 (నినాదం):** బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల హక్కుల సాధనకై ఐక్య పోరాటాలు చేద్దామని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ ఐలయ్య తెలిపారు. జవహర్ నగర్ స్థానిక బాలాజీ నగర్ చౌరస్తాలో ఆదివారం అంబేద్కర్ మహనీయులకు భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 97వ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు. సిహెచ్ అవిలయ్య హాజరై అంబేద్కర్ మహనీయులకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడు కొందరు వాడు కాదు అని అంబేద్కర్ ఆశయ సాధన కోసం బీసీ ,ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీలు ఏకం కావాలనీ, ఐక్య పోరాటాలను ఏకం చేయాలన్నారు. చదువు సంపద సామాజిక అభివృద్ధి కోసం పోరాడుతున్న భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వ ర్యంలో ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి అవకాశాలు కోసం , ప్రైవేట్ యాజమాన్య సంస్థలలో రిజర్వేషన్ల ప్రక్రియ ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుందన్న నమ్మకం ఉంది అన్నారు,చరిత్ర తెలియనివాడు చరిత్రను సృష్టించలేడు, మన ముత్తాతలు తాతలు తండ్రులు పడిన శ్రమ ఫలితాలను మనం గుర్తు తెచ్చుకుందాం, ఎందరో మహనీయులు పడిన శ్రమ, పోరాట ఫలితమే నేడు హక్కులు ఆత్మగౌరవంతో తెల్లని వస్త్రాలను ధరించి , వందల కోట్లు సంపాదిస్తు, రాజ్యాంగ రీత్యా పదవులు ఉద్యోగం చేస్తున్నా వారందరికీ కృతజ్ఞతలు, మనం ఈ విధంగా ఉండడానికి కొంత మంది మహనీయుల పోరాట ఫలితం , గౌతమ బుద్ధుని సామ్య వాదం, జ్యోతిరావు పూలే అక్షరాయుధం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలం నుండి జాలువారిన రాజ్యాంగం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వికలాంగుల అభివృద్ధి ఆత్మగౌరవం దక్కింది, మహిళా ఆత్మ గౌరవం దక్కింది,, కానీ ఈరోజు మన పరిస్థితి ఏమిటి ?. సౌకర్యాలు రాగానే మూలాలను మరిచిపోతున్నాం,! కుర్చీ రాగానే; ఆ కుర్చీని ప్రసాదించిన మహనీయులను విస్మరిస్తున్నాం! కృతజ్ఞతలు లేని సమాజం ఎక్కువ కాలం స్వేచ్ఛగా ఉండదు, అందుకనే అగ్రవర్ణాలు అహంకార ధోరణితో మళ్ళీ కార్మిక కొత్త చట్టాలతో బానిసత్వం లోకి నెట్టుతు న్నారు . మళ్లీ బానిసత్వం రాబోతుంది. ఎందరో మహానుభావులు త్యాగం చేస్తేనే నేడు మనం వారికి కృతజ్ఞత కలిగి ఉన్నాము, అని తెలిపారు. హక్కులను కాపాడుకుంటూనే సామాజిక బాధ్యతలను గుర్తించుకుందాం, ఉద్యోగం, వ్యాపారం, కేవలం మీ కుటుంబం కోసమే కాదు. మిమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చిన సమాజం కోసం మన అందరం కృతజ్ఞత కలిగి ఉందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు కొయ్యాడ వెంకటేష్, బాబు జగ్జీవన్ రావు కమిటీ అధ్యక్షులు గడిపె సునీల్, కార్యవర్గం గడ్డం గిరి, నరేందర్, అరుణ్, ఆంజనేయులు ,మహేష్, కార్మికులు, కొయ్యాడ అయిలయ్య,రాములు, తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది

**వైరా ఎమ్మెల్యే రాందాస్**



**వైరా, జూన్7(నినాదం):** ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, విద్యావం తులైన పౌరు లను తీర్చిదిద్ది సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలిగేది ఉపాధ్యాయులేనని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం వైరాలో, గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతానికి పైగా హాజరైన ఉపాధ్యా యులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పంపించిన ప్రశంసాపత్రాలను తన చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిబద్ధతతో, అంకితభావంతో బోధన చేయగలిగితే ప్రైవేట్ పాఠశాలల కన్నా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన వైరా ఫిషరీస్ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నరసింహారావు, బీరెల్లి రామకృష్ణ లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు, జూన్7 (నినాదం) :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అంది స్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ అన్నారు. ఇస్నా పూర్ వీరభద్రి యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ముత్తంగి డివిజన్ పరిధిలో గల భవన నిర్మాణ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇస్నాపూర్ వీరభద్రీయుల సంక్షేమం కోసం ఇప్పటికే సొంత నిధులతో 200 గజాల స్థలం అందించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ అండగా ఉంటానని భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్, సందీప్, రామకృష్ణ, సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాస్, పటాన్చెరు అధ్యక్షులు చవ్వ కొండల్, పాల్గొన్నారు.

# బాధితుడిని పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

**వికారాబాద్, జూన్7 (నినాదం):** జిల్లా పరిధిలోని యాలాల్ మండల్ పి ఏ సీ ఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి హైదరాబాద్ హైటెక్ సిటీ లోని యశోద హాస్పిటల్ లో కాలికి శస్త్ర చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న సురేందర్ రెడ్డి ని ఆదివారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని విశ్రాంతి తీసుకోని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మహేందర్ రెడ్డితో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార కోఆర్డినేటర్ కరణం పురుషోత్తం రావు, సుధాకర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ చారీ, అబ్దుల్ ఖవి, బిర్కెట్ రఘు, భగవాన్, సిద్దూ అయ్యా, రవి కుమార్, కాంతు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు కాలుష్యం.. నీటి కాలుష్యం లేని వాతావరణం కల్పించే బాధ్యత మనపై ఉంది

**జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి**



**అల్వాల్, జూన్ 7 (నినాదం) :** జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి అల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లతో కలిసి మచ్చ బొల్లారం లోని డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. డంపింగ్ యార్డ్ హిందు స్మశాన వాటిక రక్షించాలని చేస్తున్న నిరసన కార్యక్రమం లో పరిసరాల150 కాలనీల సభ్యులు పాల్గొన్నారు. కాలనీ వారు మాట్లాడుతూ కలుషితమైన వాతావరణం విడుదలవుతున్న డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని ఎన్నో రోజులుగా ఆందోళన చెందుతున్న నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవరిస్తున్నారని సభ్యురాలతో కాలనీవాసులు మొరపెట్టుకున్నారు ఇదివరకే జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వలన అక్కడ ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని దాని మాదిరిగా మచ్చ బొల్లారం డంపింగ్ యార్డ్ వలన ఇక్కడ ప్రజలు స్వేచ్ఛగా బతకడం కష్టంగా మారిందని కాలేజ్ నివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం,నీటి కాలుష్యము వలన ఎందరో అనారోగ్యానికి గురి అవుతున్నారని, ముమ్మాటికి డెంపింగ్ యార్డ్ తీసివేసి ప్రజలకు ఉపయోగపడే హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ముక్తకంఠంగా కోరారు సభ్యురాలు విజయభారతి మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడుటానికి వచ్చానని డంపింగ్ యార్డ్ పెట్టడానికి అనుమతి ఉన్నదా అని డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లను ప్రశ్నించారు. ఎవరి అనుమతితో కొనసాగుతున్నదని ఎట్టి పరిస్థితి లోనైనా తీసివేసి ప్రజల కోరికమేరకు నడుచుకోవాలని డిసికిఅసహనం వ్యక్తం చేశారు. డి సి కి ఐదు ప్రశ్నలకు పది రోజుల్లోగా నాకు సమాధానం కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు. కాలనీలజేఏసీ ప్రెసిడెంట్ ఉదయ్ ప్రకాష్,సెక్రటరీ సుధాకర్ పడాల, రోహిత్ రావు, పవన్, ప్రవీణ్, కుమార్, కనకయ్య,కవిత, పుష్పవతి,ఉమా, నర్మదా పాల్గొన్నారు.

# అడ్డగోలు ధరలతో ప్రజలపై భారీ భారం

**భూముల మార్కెట్ విలువల పెంపుపై ఆగ్రహం**
**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



**జిన్నారం /గుమ్మడిదల 05( నినాదం న్యూస్ ) :** రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను అమాంతం పెంచి ప్రజలపై భారీ ఆర్థిక భారం మోపుతోందని పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సీజీఆర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని భూముల మార్కెట్ విలువలను 25 శాతం నుంచి 100 శాతం వరకు పెంచడం దారుణమని మండిపడ్డారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా ఇంత భారీ పెంపు చేపట్టడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనని పేర్కొన్నారు. భూముల కొనుగోలు, విక్రయాలతో పాటు రిజిస్ట్రేషన్లపై కూడా అదనపు భారం పడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం మరింత కష్టతరంగా మారుతుందని, రైతులు భూముల కొనుగోళ్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం కొత్త భారాలు మోపడం సమంజసం కాదని పేర్కొన్నారు. భూముల మార్కెట్ విలువల పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యంగ్యం కాదు ....వ్యవస్థపై నిరసన

కాక్రోచ్ మాస్క్ వెనుక

## దాగిన యువత ఆగ్రహం...

ఎడిటోరియల్

భారతదేశం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద యువజన జనాభా కలిగిన దేశమని పాలకులు గర్వంగా చెబుతున్నారు. "మేక్ ఇన్ ఇండియా", "స్టార్టప్ ఇండియా", "డిజిటల్ ఇండియా", "వికసిత్ భారత్" వంటి నినాదాలతో దేశ భవిష్యత్తు గురించి గొప్ప చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నారు. కానీ ఆ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత మాత్రం నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, విద్యా వ్యాపారీకరణ,అవకాశాల కొరతతో తీవ్ర అసంతృప్తిలో ఉంది. ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన "కాక్రోచ్ జనతా పార్టీ" ఉద్యమం, నీట్ పరీక్షల వివాదాలు, నిరుద్యోగ యువత ఆందోళనలు ఈ అసంతృప్తికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.
సాధారణంగా కాక్రోచ్ అంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా బతికే జీవి. యువత ఈప్రతీకను ఎంచుకోవడం వెనుక ఉన్న సందేశం చాలా లోతైనది. ప్రభుత్వాల వైఫల్యాలు, రాజకీయ మోసాలు, ఉద్యోగాల కొరత, పరీక్షల లీకేజీలు, విద్యా వ్యవస్థలో అవినీతి మధ్య తాము కూడా కాక్రోచ్‌ల మాదిరిగా మనుగడ కోసం పోరాడుతున్నామని చెప్పడమే ఈ ప్రతీక వెనుక ఉద్దేశం. ఇది కేవలం వ్యంగ్యం కాదు; వ్యవస్థపై ఒక తీవ్రమైన నిరసన.
దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువకులు ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తున్నారు. కానీ వారికి తగిన స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది ఖాళీలు ఉన్నప్పటికీ వాటి భర్తీ నత్తనడకన సాగుతోంది. మరోవైపు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలు శాశ్వత ఉద్యోగాల స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఉన్నత విద్యను పూర్తి చేసిన లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.
ఇటీవల నీట్ పరీక్ష చుట్టూ జరిగిన వివాదాలు, ప్రశ్నాపత్రాల లీకేజీల ఆరోపణలు, పరీక్షల నిర్వహణలో వ్యక్తమైన అనుమానాలు విద్యార్థుల్లో తీవ్రమైన ఆందోళనకు కారణమయ్యాయి. ఒక విద్యార్థి జీవితంలో ఒక పరీక్ష ఎంత కీలకమో అర్థం చేసుకోకుండా వ్యవస్థ వ్యవహరిస్తే, అతని భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తడం వారి ఆశలను, కుటుంబాల ఆకాంక్షలను దెబ్బతీస్తోంది. ఇక్కడే కాక్రోచ్ జనతా పార్టీ వంటి ఉద్యమాల ప్రాముఖ్యత కనిపిస్తుంది. ఇది ఎన్నికల్లో గెలవడం కోసం ఏర్పడిన రాజకీయ పార్టీ కంటే ఎక్కువ. సంప్రదాయ రాజకీయాలపై యువత కోల్పోతున్న విశ్వాసానికి ఇది ఒక సంకేతం. "మీరు మమ్మల్ని పట్టించుకోవడం లేదు... అందుకే మేము మిమ్మల్ని ఎద్దేవా చేస్తున్నాం" అనే నిరసన స్వరంగా దీన్ని చూడాలి. ఈ పరిస్థితికి మూల కారణం పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనానే. దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ వర్గాల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, కోట్లాది మంది యువతకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. విద్య కూడా హక్కు కాకుండా వ్యాపార వస్తువుగా మారుతోంది. లక్షల రూపాయల ఫీజులు చెల్లించి చదివిన విద్యార్థి చివరకు ఉద్యోగం కోసం నిరసన ర్యాలీల్లో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇవ్వడంలో చూపే వేగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో కనిపించడం లేదు. ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు అడగడం నేరం కాదు. నిరసనలు వ్యక్తం చేయడం అసాంఘిక చర్య కాదు. కానీ నేడు యువత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని రాజకీయ వ్యవస్థ, వారి నిరసనలను రాజకీయ కుట్రలుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. నిరుద్యోగం ఎందుకు పెరుగుతోంది? ఖాళీ పోస్టులు ఎందుకు భర్తీ కావడం లేదు? పరీక్షల్లో పారదర్శకత ఎందుకు లేదు? విద్య ఎందుకు ఖరీదైన వస్తువుగా మారింది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. నేడు కాక్రోచ్ మాస్క్ ధరించి రోడ్డెక్కిన యువకుడు కేవలం ఒక వ్యక్తి కాదు. అతని వెనుక కోట్లాది మంది నిరుద్యోగులు, పరీక్షల కోసం జీవితాలను పణంగా పెట్టిన విద్యార్థులు, తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి చదివిస్తున్న తల్లిదండ్రులు ఉన్నారు. ఆ మాస్క్ వెనుక దాగి ఉన్నది ఒక మనిషి ముఖం కాదు–వ్యవస్థపై పెరుగుతున్న ప్రజా అసంతృప్తి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని చెప్పడం సులభం. కానీ యువత భవిష్యత్తును భద్రపరచడం పాలకుల బాధ్యత. ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా వ్యవస్థ, ప్రభుత్వ రంగ బలోపేతం, సామాజిక న్యాయం–ఇవి లేకుండా "వికసిత్ భారత్" కేవలం ఒక నినాదంగానే మిగిలిపోతుంది. నేడు యువత చెబుతున్నది ఒక్కటే–మాకు ప్రచారాలు కాదు, ఉద్యోగాలు కావాలి. నినాదాలు కాదు, అవకాశాలు కావాలి. హామీలు కాదు, భవిష్యత్తుపై భరోసా కావాలి. ఆ స్వరాన్ని వినలేకపోతే, రేపు కాక్రోచ్ జనతా పార్టీలు మాత్రమే కాదు, మరెన్నో నిరసన రూపాలు పుట్టుకొస్తాయి. అవి ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు... ప్రజల సమస్యలను పట్టించుకోని పాలకులకు వినిపిస్తున్న హెచ్చరిక గంటలు.

సముద్రాలతో నూతన

## బంధాలను ఆవిష్కరించలేమా !

(08 జూన్ "ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం" సందర్భంగా)

భూగ్రహాన్ని 71 శాతం వరకు జలమే ఆక్రమించుకొని అసంఖ్యాక జీవుల మనుగడకు ఊపిరి పోస్తున్నది. సముద్ర జలాల ప్రాణికోటికి ప్రాణ వాయువును అందిస్తూ, బిలియన్ల మానవాళికా జీవనోపాధులను కల్పిస్తూ, దాదాపు 80 శాతం జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి మహా సముద్రాలు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సముద్ర జలాలు అతిగా చేపలను పట్టడం, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, సముద్ర ఉపరితలాల ఉష్ణోగ్రతలు పెరగడం, జల ఆమ్లీకరణ, సముద్ర జీవ వైవిధ్యం లాంటి పలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నది. నేడు కేవలం 17 శాతం నేల, 8 శాతం మహాసముద్రాలు మాత్రమే పరిరక్షించబడుతున్నాయి. మహాసముద్రాల దీర్ఘకాలిక మనుగడలు, బీచ్‌లు, సముద్ర సంపద, జల చక్రం, కార్బన్ చక్రం, సముద్ర ఆహారం, ఉపరితల రవాణా, ఓడ రేవులు, సముద్ర క్రీడలు, సముద్ర శ్వచ్ఛత, సముద్ర వనరుల వినియోగం మొదలగు పలు అంశాలు మహాసముద్రాలతో ముడిపడి ఉన్నాయి. ధరణిని నీలి గ్రహంగా పిలవడానికి నీలి వర్ణపు మహాసముద్రాలే కారణం. మనం 30 శాతం వరకు సముద్రాలను సంరక్షించుకోగలిగితే వాతావరణ సానుకూల మార్పులు, జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిర జీవ వ్యవస్థలు సుసాధ్యం అవుతాయి. నేడు భూమండలంపై పసిఫిక్ (అత్యంత పొడవైన, లోతైన), అట్లాంటిక్(అతి లవణ సాంద్రత), ఇండియన్, ఆర్కిటిక్(అతి చిన్న, అతిశీతల, అతి ఇరుకైన), అంటార్కిటిక్(సదరన్) అనబడే ఐదు ప్రధాన మహాసముద్రాలు ఉన్నాయని మనకు తెలుసు.

**మహాసముద్రాలను కాపాడితే అవి మానవాళిని కాపాడుతాయి:**

1992లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 08 జూన్ రోజున విశ్వవ్యాప్తంగా "ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం (వరల్డ్ ఓసియన్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. మహాసముద్రాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడం, వాటిని పరిరక్షించుకుంటేనే భవిష్యత్తు తరాల మనుగడ సుసాధ్యం అవుతుందని వివరించడం జరుగుతుంది. సముద్ర చేపలను పరిమితులకు మించి అతిగా పట్టడం వల్ల అపార్థాలు జరుగుతాయని వివరించడం ప్రధానమైనదిగా భావిస్తున్నారు. ప్రపంచ మహాసముద్రాల దినం–2026 ఇతివృత్తంగా "పునఃకల్పన : మనకు తెలిసిన ప్రపంచం ఆవల, మన సముద్రాలతో ఒక నూతన బంధం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడిస్తూ, ఆవిష్కరణలను ఊతం ఇస్తూ, సాంప్రదాయ పద్ధతులకు మెరుగులు దిద్దుతూ మహాసముద్రాల ఆరోగ్యాలను కాపాడడం కొనసాగాలి. ప్రతి ఏట 13 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లోకి చేరుతున్నాయి. నేడు మహాసముద్రాలను డంపింగ్ యార్డులుగా పరిగణించడం ప్రమాదకరం, ఆక్షేపణీయం. దీని వల్ల మహమ్మారి వైరస్‌లు, సునామీలు, తుఫాన్లు, అకాల వర్షాలు, తీవ్ర అనారోగ్యాలు లాంటి విపత్తులు వస్తున్నాయి. నేడు మహాసముద్రాలను కాపాడడానికి దాదాపు 2,000లకు పైగా సంస్థలు కృషి చేయడం ముదావహం.

**లక్షల జీవుల నెలవులు:**

భూమిపై ఉన్న జలవనరుల్లోనే 90 శాతం వరకు జీవావరణం దాగినఉంది. భూమి ఉపరితల జలాల్లో 97 శాతం మహాసముద్రాల్లోనే దాగి ఉన్నాయి. అన్ని మహాసముద్రాల ఘనపరిమాణం 1.35 బిలియన్ క్యూబిక్ కిలోమీటర్లు ఉండగా, సముద్రాల సగటు లోతు 3,700 మీటర్లుగా రికార్డు అయ్యింది. సముద్రాల్లో 2,30,000 రకాల జీవజాతులు గుర్తించబడినవి. ప్రపంచ మానవాళి దృష్టిని మహాసముద్రాల పరిరక్షణ వైపు మరల్చడంతో పాటు సముద్రాలను నిలబెడితేనే అవి ప్రాణికోటిని కూడా నిలుపుతాయని గుర్తుంచుకోవాలి. దాదాపు 3 బిలియన్ల ప్రజలు సముద్ర జలాలపై పోషకాహారం కోసం ఆధారపడి జీవనోపాధులను పొందుతున్నారని, దాదాపు 10 శాతం ప్రజలు సముద్ర చేపల మీద ఆధారపడి జీవితాలను గడుపుతున్నారని తెలుసుకోవాలి. ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు, పౌర సమాజం చేయి చేయి కలిపి మహాసముద్రాలను పరిక్షించుకోవాలి, రేపటి సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలి. జలమే జీవనాధారమని, సముద్రాలను కాపాడితేనే ఉజ్వల భవిత అని భావిస్తూ సముద్ర దేవతకు రక్షణ గొడుగు పడుతూ, రక్షించమని వేడుకుందాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# తెలుగు భాష తల్లికి దేవులపల్లి ఎనలేని సేవలు

**నేడు దేవులపల్లి రామానుజ రావు వర్ధంతి**



తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష తెరమరుగు అవుతున్న సమయంలో, తెలుగు భాషను కాపాడిన స్వభాషాభిమానులలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. జీవిత మంతా సాహితీ సేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి రామానుజరావు. విద్యార్థి దశ నుండే మాతృభాషపై మమకారం పెంచుకుని, తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన ఒక గొప్ప సాహిత్యాభిమాని. నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచిన వారిలో రామానుజరావు ఒకరు. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు ఎంతో కృషి చేసి, జీవిత కాలమంతా సారస్వత పరిషత్ ఉపాధ్యక్షుడుగా, అధ్యక్షుడుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణరావు. స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసారు. దేవులపల్లి రామానుజరావు వరంగల్ జిల్లా బొల్లికుంటలో 1917 ఆగస్టు 25న కలిగిన కుటుంబంలో జన్మించారు. డిగ్రీలో చేరేదాకా వరంగల్లులో, తర్వాత నిజాం కళాశాలలో, మధ్యలో కొంత విరామం తర్వాత నాగపూర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఉద్యోగం కోసం వెదకక, రాజకీయ, సాహిత్య రంగాల్లో కృషి చేశారు. సాహిత్య రంగంతోపాటు విద్యారంగం, గ్రంథాలయోద్యమం, విశ్వ విద్యాలయం, పత్రికా రచన, రాజకీయాలు, సహకారోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, విశాలాంధ్రోద్యమం, రాజ్యసభ సభ్యత్వం– ఇలా తెలుగు వారి జీవితానికి సంబంధించిన సకల రంగాల్లోనూ ఆయన పాత్ర ఉంది.
1943 మే 23న ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తుతో ఆయనకు మొదటి నుంచి సంబంధం ఉంది. 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా మొదలై, 1947లో కార్యదర్శి అయి, 1952లో తొలిసారి అధ్యక్షుడై మధ్యలో కొంత విరామం తప్ప జీవితం చాలించే దాకా ఆ సంస్థకు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగులో ప్రవేశ, విశారద లాంటి పరీక్షలు నిర్వహించింది. తెలుగు మాధ్యమంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తెలుగు అధ్యాపకుల కొరత తీర్చింది ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారే. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ప్రాథమికోపాధ్యాయులు గానూ, విశారద పరీక్ష పూర్తి చేసిన వారిని ఉన్నత పాఠశాల అధ్యాపకులుగా నియమించేవారు. ఈ పరీక్షలు తెలంగాణలోనే కాక, తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటిలో... బెంగళూరు, మైసూరు, హోసూరు, బొంబాయి, షోలాపూర్ వంటి అనేక ప్రాంతాల్లో నిర్వహించేవారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి పండిత శిక్షణను కూడా రామానుజరావు సారథ్యంలోని సారస్వత పరిషత్తే చేపట్టింది. అక్షరాస్యతా ప్రచారం, వయోజన విద్య కూడా పరిషత్తు కార్యక్రమాల్లో భాగం. 1953లో అలంపురంలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షిక సభల నిర్వహణ బాధ్యతను తలకెత్తుకున్నదీ ఆయనే. అప్పటి ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ సభలను ప్రారంభించడమే కాక రెండు రోజులూ వాటికి హాజరయ్యారు.
ఆ సభల్లోనే తెలంగాణ రచయితల సంఘం దాశరథి అధ్యక్షులుగా, సి.నారాయణరెడ్డి కార్యదర్శిగా, శ్రీశ్రీ గౌరవాధ్యక్షుడిగా ఏర్పాటైంది. కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా 1957 నుంచి 1985 దాకా ఆయన జీవితంలో చాలా భాగం సాహిత్య అకాడమీతో ముడిపడింది. సాహిత్య అకాడమీ కార్యభారం మోసింది రామానుజరావే. అకాడమీ వృత్తి పదకోశాలు ప్రచురించడం, ప్రాచీన గ్రంథాలు ప్రచురించి చౌకగా అందుబాటు లోకి తేవడమూ ఆయన చలవే. సాహిత్య అకాడమీ నిర్వహణలో గానీ, సారస్వత పరిషత్తును నడపటంలో గాని రామానుజరావు తానే ఒక వ్యవస్థగా మారారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించినన్ని గ్రంథాలు దేశంలో మరే సాహిత్య అకాడమీ వెలువరించలేదు.
ఉస్మానియా యూనివర్సిటీతో రామానుజరావుకు అమితమైన సంబంధం ఉంది. 1953 నుంచి 1976 దాకా సెనేట్, సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. 1972, 1973, 1975లో మూడుసార్లు తాత్కాలిక ఉపకులపతిగా వ్యవహరించారు. 1960 నుంచి 1962 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. నాడు తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక విశ్వ విద్యాలయం ఉస్మానియా. తెలుగు భాషకు ద్రోహం చేస్తూ, ఉర్దూను కృత్రిమత్వానికి గురిచేస్తూ కొందరు స్వార్థ పరులు ఉస్మానియాను హిందీ యూనివర్సిటీగా మార్చి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని ప్రయత్నాలు చేశారు. ఉన్న ఒక్క విశ్వవిద్యాలయమూ పోయే పరిస్థితి ఎదురైనప్పుడు పౌర సంఘాన్ని ఏర్పాటు చేసి పోరాడి ఉస్మానియాను తెలుగువారికి దక్కించడంలో రామానుజరావు అద్వితీయ కృషి చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు అతి వైభవంగా జరిగాయి. ఈ సభం రూపకల్పనలో రామానుజరావు పాత్ర ప్రమేయం, ప్రాతినిధ్యం ప్రముఖం. 1974, జనవరిలో రవీంద్రభారతిలో జరిగిన రామానుజరావు స్మారకోమాసంలో నాటి భారత ప్రధాని పి.వి. తమ ప్రసంగంలో వారిద్దరూ కలిసి నాగపూర్లో న్యాయశాస్త్రాన్ని చదువుకున్న రోజులను గుర్తుచేసు కోవడం విశేషం. సాహిత్య సేవే జీవిత పరమావధిగా, కనీసం సొంత ఇల్లు కూడా సమ కూర్చు కోవడంపై దృష్టి నిలపక, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు మాత్రం వందల కోట్ల రూపాయల ఆస్తులను సమకూర్చి పెట్టిన రామానుజరావు 1993, జూన్ 8న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. తెలుగు ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# మృగశిరలో సూర్యుడు ప్రవేశం

**వ్యవసాయ పనులకు అనుకూలం**



భారతీయ జ్యోతిష సాంప్రదాయ ప్రకారం ఒక్కో కార్తెలో దానికి సంబంధించి ప్రకృతిలోని మార్పు, దానివలన జరిగే ప్రత్యేకాంశలను సవివరంగా వివరించింది. ఈ కార్తెల ఆధారంగా వ్యవసాయ దారులు, జానపదులు ( గ్రామీన ప్రాంతం వారు) ఎక్కువగా వీటిపై ఆధారపడి చేయువృత్తులు, వ్యవసాయం సాగు ఈ కాలగణనతో కార్తెల అధా రంగా వారి పంటల నిర్ణయం, సాగు చేసుకుం టారు. సూర్యుడు మృగశిర నక్షత్రంలో ప్రవేశించిన నాటి నుండి మృగశిరకార్తె ఏర్పడుతుంది. ఈ కార్తె నుండి వర్షాలు పడతాయని అన్నదాతల భావన. ఇదే సమయంలో మన ప్రాంతంలోకి నైఋతి ఋతుపవనాలు ప్రవేశిస్తాయి.
పురాణగాథ ప్రకారం మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అను వృతాసురుడు వరప్రభావంచే పశువులను, పంటలను హరించి వేయడం ప్రకృతి భీభత్సాలాను సృష్టించడం, వర్షాలకు అడ్డుపడటం జరుగుతూ ఉండేది. ఆయన చనిపోకుండా అనేక వరాలు కలిగి ఉండటంచేత, ఇంద్రుడు సముద్ర అలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపాడు. ఖగోళంలో ఇంద్ర నక్షత్రమైన జ్యేష్టాకు, మృగశిరకు 180 డిగ్రీల దూరంలో ఉండటం వలన, తూర్పు ఆకాశంలో ఇంద్ర నక్షత్రం ఉదయించగానే, వృతాసుర నక్షత్రం అస్తమిస్తుంటుంది. భారతదేశంలో మృగశిర కార్తెకు విశేష ప్రాధాన్యత ఉంది. రోహిణి కార్తెలో, రోళ్లు పగిలే ఎండలతో సతమతమయ్యే జీవకోటికి, ఈ కార్తెలో వచ్చే నైరుతి రుతువపవనాలతో వాతావరణం చల్లబడి, ఉపశమనం కలుగుతుంది. ఈ కార్తెను రైతులు ఏరువాక సాగే కాలం అని కూడా అంటారు. ఏరువాక అంటే నాగటి చాలు.. ఈ కాలంలో రుతుపవనాలు విస్తరించి, తొలకరి జల్లులు పడగానే, పొలాలు దున్ని పంటలు వేయడం మొదలుపెడతారు.
చంద్రుడు ఒక్కొక్క నక్షత్రం సమీపంలో 14 రోజుల పాటు ఉంటాడు. ఏ నక్షత్రం సమీపంలో ఉంటే.. ఆ కార్తెకు ఆ పేరు పెడతారు.
సౌరమానం ప్రకారం గణించడంతో ఈ కార్తెలు గ్రెగేరియన్ క్యాలెండరు ప్రకారం ఏటా ఒకే తేదీల్లో వస్తాయి. అశ్వినితో ప్రారంభమై రేవతితో ముగిసే కార్తులు ఇరవై ఏడు నక్షత్రాల పేర్లతో ఉన్నాయి. అవి 1.అశ్వని, 2.భరణి, 3.కృత్తిక, 4.రోహిణి 5.మృగశిర 6. ఆరుద్ర 7.పునర్వసు 8.పుష్యమి 9.ఆశ్లేష 10.మఖ 11.పుబ్బ 12.ఉత్తర 13.హస్త 14. చిత్త 15.స్వాతి 16.విశాఖ 17.అనూరాధ 18. జ్యేష్ఠ 19.మూల 20.పూర్వాషాడ 21.ఉత్తరాషాడ 22.శ్రవణం 23.ధనిష్ట 24.శతభిషం 25.పుర్వాబాధ్ర 26. ఉత్తరాబాధ్ర 27.రేవతి. అశ్వినితో ప్రారంభమై రేవతితో ముగిసే వరకు మొత్తం ఇరవై ఏడు నక్షత్రాల పేర్లతో కార్తెలు ఉన్నాయి. ప్రస్తుతం మృగశిర నక్షత్రానికి చేరువలో చంద్రుడు ఉండటం వల్ల దీనికి "మృగశిర కార్తె" అనే పేరు వచ్చింది.
వైశంపాయనుడు మృగశిర కార్తె రోజునే తన శిష్యుడైన యాజ్ఞవల్క్యునికి తైత్తిరీయోపనిషత్తును బోధించాడని అంటారు. ఈ ఉపనిషత్తు వర్షాధిపతి అయిన వరుణదేవుని ప్రార్థనతోనే ప్రారంభం అవుతుంది. ఈ కార్తె ప్రాధాన్యత మనకు భగవద్గీతలోనూ కనిపిస్తుంది.. తొలకరి జల్లుల అనంతరం ధరణి నుంచి ఉద్భవించి వ్యాపించే పరిమళాన్ని తానేనని వివరిస్తాడు శ్రీకృష్ణుడు. ఈ సమయంలో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండి, మానవునిలో ఓజస్సు, తేజస్సు మృగశిర కార్తె అనంతరం అధికం అవుతాయని జీవకుడనే ప్రాచీన వైద్యుడు, తన గ్రంథాల్లో వివరించాడు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈరోజున ఆధ్యాత్మిక చింతనతో గడపాలని శాస్త్రాలు చెపుతున్నాయి.
మృగశిర కార్తె మొదటి రోజును దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మృగశిర, మృగం, మిరుగు, మిర్గం పేర్లతో వ్యవహరిస్తారు. ఈ రోజున ప్రజలు బెల్లంలో ఇంగువను కలుపుకుని సేవిస్తారు. ఇంగువ శరీరంలో ఉష్ణాన్ని ప్రేరేపించి.. వర్షాకాలంలో సోకే వ్యాధులను నియంత్రిస్తుందని పెద్దలు చెబుతారు. అలాగే మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపలు/ఇతర మాంసాహారం తింటే వ్యాధులు దరిచేరవని ప్రజల విశ్వాసం..
ఈ కాలంలో పడే వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా సద్వినియోగ పరుచుకునే మార్గాలను అన్వేశించాలి. ఇంకుడు గుంతల నిర్మాణం వలన మనకు భవిష్యత్తులో అవి భూమిలో నీటి నిల్వలను పెంచి చెరువులు, భావులు, బోర్లు ఎండి పోకుండా ఉపయోగపడతాయి. అలాగే భూవసతి ఉన్న చోటల్లా, ఎక్కువ మోతాదులో చెట్లను నాటాలి. స్థలంలేని వాళ్ళు మనం నివసించే పరిసర ప్రాంతాలలో, మన ఊరి రోడ్డునకు ఇరువైపులా, శక్తి వంచన లేకుండా చెట్లను నాటితే, అవి మనకు మేలు చేస్తాయి. భవిష్యత్తులో అవే కాపాడుతాయి. సమాజానికి ఉపయోగడే పనులకు సమిష్టిగా పనిచేయ సంకల్పించడం ప్రతివారీ సామాజిక బాధ్యత.

**రామ కిష్టయ్య సంగనభట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం

**అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ దినం**



ప్రతి సంవత్సరం జూన్ 8ను అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ దినంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రజల్లో బ్రెయిన్ ట్యూమర్ పట్ల అవగాహన పెంపు, బాధితులకు మానవీయ మద్దతు కల్పించడం, అలాగే శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం. జర్మన్ బ్రెయిన్ ట్యూమర్ అసోసియేషన్ 2000వ సంవత్సరంలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ రోజు అనేక మంది జీవితాల్లో ఆశను నింపే ఉద్యమంగా మారింది.

బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులోని కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల ఏర్పడే గడ్డ. ఇవి మెదడులో ఏర్పడిన ప్రాథమిక ట్యూమర్‌లు కావచ్చు లేదా శరీరంలోని ఇతర భాగాల నుంచి మెదడుకు వ్యాపించిన మెటాస్టాటిక్ ట్యూమర్‌లు కావచ్చు. ఈ ట్యూమర్‌లు కొన్నిసార్లు సౌమ్యంగా ఉండవచ్చు (బినైన్), మరికొన్నిసార్లు మెలిగ్నెంట్‌గా మారి ప్రాణాంతకంగా మారుతాయి. అయితే, రెండు రకాల ట్యూమర్లూ మెదడుపై ఒత్తిడిని కలిగించి, మానసిక, శారీరక పనితీరును ప్రభావితం చేయగలవు.

బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు చాలా విభిన్నంగా కనిపించవచ్చు. ఉదయపు తలనొప్పులు, మూర్ఛ, జ్ఞాపకశక్తి లోపం, చూపులో మార్పులు, చేతులు కాళ్లలో బలహీనత, నడకలో తడబాటు, మాట్లాడడంలో తేడా, భావోద్వేగాల్లో మార్పులు వంటి సమస్యలు కనిపించవచ్చు. వీటి గురించి సరైన అవగాహన లేకపోతే రోగ నిర్ధారణ ఆలస్యమై, చికిత్స ప్రయోజనకరంగా మారదు. ఇటువంటి సందర్భాల్లో ముందస్తు గుర్తింపు జీవితాన్ని నిలుపుతుంది. ఈ లక్షణాలను గమనించినప్పుడు వైద్య సలహా తీసుకోవడం అత్యవసరం.

బ్రెయిన్ ట్యూమర్ నిర్ధారణకు ఎమ్ఆర్ఐ, సీటీ స్కాన్, బయోప్సీ వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. చికిత్సలో శస్త్రచికిత్స, రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి విధానాలు వినియోగించబడతాయి. ట్యూమర్ స్థితిగతులు, రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా చికిత్స మారుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం కనీసం మూడు లక్షల మందిలో బ్రెయిన్ ట్యూమర్ కొత్తగా గుర్తించ బడుతోంది. పిల్లల క్యాన్సర్ రోగాల్లో ఇది మూడవ స్థానంలో ఉంది. భారత దేశంలో సంవత్సరానికి సుమారు 40,000 నుంచి 50,000 కొత్త కేసులు నమోదవుతున్నట్లు నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రాం అంచనా వేస్తోంది. భారత దేశంలో బ్రెయిన్ ట్యూమర్ రోగులలో సగం మంది నలభై ఏళ్ల లోపువారే. ఇది మానవ వనరులపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పవచ్చు. అంతేకాదు, భారత్ వంటి దేశాల్లో వైద్య వసతుల కొరత, అవగాహన లోపం, ఆర్థిక పరిమితులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లేకపోవడం వంటి అంశాలు చికిత్సను మరింత కష్టతరంగా చేస్తున్నాయి.

ఈ దినోత్సవం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపుకు తోడుగా, రోగులకు మానసిక బలాన్నివ్వడం, శాస్త్రీయ పరిశోధనలకు నిధులు సేకరించడం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సహకారంతో ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మొబైల్ డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య బీమా అవగాహన కార్యక్రమాలు, పేద రోగులకు చికిత్సా బదిలీ పథకాలు అవసరమవుతున్నాయి.

ఈ రోజున మనం ప్రతి బాధితుడికి మద్దతుగా నిలబడితే, ప్రతి శాస్త్రవేత్త పరిశోధనకు కావాల్సిన వనరులు అందించగలిగితే, ప్రతి కుటుంబానికి అవగాహనను అందించగలిగితే --- భవిష్యత్తులో మెదడు ఆరోగ్యానికి భద్రత కల్పించ గలుగుతాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**
**9440595494**

## బోనాల సందడి...!



**పాలేరు,జూన్ 7( నినాదం):** నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో అదివారం బోనాల సందడి నెలకొంది. మండలం లోని ఆచార్లగూడెం లో గంగమ్మ తల్లి దైవం కు బోనాల పండగ ను నిర్వహించారు. గ్రామం లో మహిళలు బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆటా, పాటలతో సందండి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు లిక్కి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం లో బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వేణు, సోసైటి చైర్మన్ తీగ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చయ తాంబులాల వేడుక

**హాజరైన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు..**



**పాలేరు,జూన్ 7( నినాదం):**
పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొరట్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగుల్ పాషా ఉ హుస్సేన్ బి దంపతుల కుమార్తె నిశ్చయతాంబులాల వేడుకకు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూర నాగరాజు హాజరై హసీనాను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో కోరట్లగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారావు, షేక్ లాల్ పాషా, షేక్ మహబూబ్ పాషా,గడిపల్లి నవీన్, షేక్ సోహేల్ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు... ప్రపంచానికి ముప్పు...

## భారత దౌత్యానికి పరీక్ష



ప్రపంచ రాజకీయాలు మరోసారి ప్రమాదకర మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటికే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మందగమనం వంటి సవాళ్లతో సతమతమవుతున్న ప్రపంచం ఇప్పుడు ఇరాన్--ఇజ్రాయిల్--అమెరికా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ఆందోళనగా గమనిస్తోంది. పశ్చిమాసియాలో చెలరేగుతున్న ఈ సంక్షోభం కేవలం మూడు దేశాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఇంధన భద్రతను, అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంది. ఇజ్రాయిల్ భద్రత పేరుతో అమెరికా మద్దతు కొనసాగుతుండగా, తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ప్రతిఘటిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీకార దాడులు, క్షిపణి ప్రయోగాలు, సైనిక హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలను పెంచుతున్నాయి. చిన్న ఘర్షణగా ప్రారంభమైన ఉద్రిక్తత పెద్ద యుద్ధంగా మారితే దాని ప్రభావం ప్రపంచంలోని ప్రతి దేశంపై పడే ప్రమాదం ఉంది.

**చమురు రాజకీయాలే అసలు కేంద్రబిందువు**

పశ్చిమాసియా అంటే కేవలం యుద్ధాలు మాత్రమే కాదు. ప్రపంచ చమురు నిల్వలకు కేంద్రం కూడా. ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషించే హార్మూజ్ జలసంధి ఇరాన్ పరిధిలో ఉండటం వల్ల అక్కడ ఏ చిన్న ఉద్రిక్తత జరిగినా ప్రపంచ మార్కెట్లు కుదేలవుతాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం అన్నీ పెరుగుతాయి. ఇప్పటికే ప్రపంచ దేశాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో పశ్చిమాసియాలో యుద్ధం మరింత విస్తరించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ అవుతుంది.

**భారత్‌కు ఎందుకు ఆందోళన?**

భారతదేశం తన ఇంధన అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందులోనూ పశ్చిమాసియా దేశాల పాత్ర అత్యంత కీలకం. చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజల జీవన వ్యయం అధికమవుతుంది.
అంతేకాదు, గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. యుద్ధం తీవ్రరూపం దాల్చితే వారి భద్రత, ఉద్యోగాలు, జీవనోపాధి ప్రశ్నార్థకమవుతాయి. విదేశీ మారకద్రవ్య ప్రవాహంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

**మోదీ దౌత్యానికి అగ్నిపరీక్ష**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ప్రస్తుతం అత్యంత సున్నితమైన విదేశాంగ సవాలును ఎదుర్కొంటోంది. అమెరికా భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామి. ఇజ్రాయిల్ రక్షణ రంగంలో కీలక మిత్రదేశం. మరోవైపు ఇరాన్‌తో కూడా భారత్‌కు చారిత్రక, వ్యాపార, వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ ఒక్క దేశానికి పూర్తిగా మద్దతు ప్రకటించడం భారత్‌కు ప్రయోజనకరం కాదు. అందుకే భారత్ "శాంతి, చర్చలు, దౌత్యపరమైన పరిష్కారం" అనే విధానాన్ని అనుసరిస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో తటస్థతను కాపాడుకుంటూనే జాతీయ ప్రయోజనాలను రక్షించడం మోడీ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

**యుద్ధం ఎవరికీ శాశ్వత పరిష్కారం కాదు**

చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే యుద్ధాలు విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తాయి. ప్రాణనష్టం, ఆర్థిక నష్టం, శరణార్థుల సమస్యలు, మానవతా సంక్షోభాలు తప్ప శాశ్వత పరిష్కారాలు ఇవ్వవు. మొదటి ప్రపంచ యుద్ధం నుంచి ఉక్రెయిన్ యుద్ధం వరకు ప్రపంచం ఇదే పాఠాన్ని మళ్లీ మళ్లీ నేర్చుకుంటూనే ఉంది.
ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా దేశాలు కూడా సైనిక చర్యల కంటే దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ శక్తులు శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలి.

**ప్రపంచానికి అవసరం శాంతి**

ప్రపంచం ప్రస్తుతం యుద్ధాలను కాదు, అభివృద్ధిని కోరుకుంటోంది. పేదరికం, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత వంటి సమస్యలు మానవాళి ముందు ఉన్నాయి. వీటిని పరిష్కరించాల్సిన సమయంలో దేశాలు యుద్ధాల్లో చిక్కుకోవడం దురదృష్టకరం. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రపంచ శాంతికి మద్దతు ఇస్తూ సమతుల్య దౌత్యాన్ని కొనసాగించాలి. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుంది. లేదంటే దాని ప్రభావం ప్రతి కుటుంబం వంటగదిలోని ఖర్చుల నుంచి దేశాల ఆర్థిక విధానాల వరకు కనిపిస్తుంది. ప్రపంచం మరో మహాయుద్ధం అంచుల వైపు వెళ్లకూడదంటే వివేకం, సంయమనం, దౌత్యం గెలవాలి. ఆయుధాలు కాదు, సంభాషణలే భవిష్యత్తును రక్షిస్తాయి.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# ఉప్పొంగిన అభిమానం

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**వికారాబాద్, జూన్ 7(నినాదం):** యువత అమితంగా అభిమానించే నాయకుల్లో తాండూర్ మాజీ ఎమ్మెల్యే ఫైలెట్ రోహిత్ రెడ్డి కి మంచి ఆదరణ ఉంది. నేపథ్యంలోలోనే బీ ఆర్ ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయన ఆదివారం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి వేడుకలను అస్వాదించారు. యంగ్ లీడర్స్ సంస్థ ఏర్పాటు చేయడం స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించి జిల్లా లో పేరొందిన ఆయన రెండవ దుబాయ్ గా పిలువబడే తాండూర్ ఎమ్మెల్యే గా విజయం సాధించి ప్రజలకు మరింత దగ్గరగా సేవలందించారు. గడిచిన శాసన సభ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆయన ప్రజా క్షేత్రంలో నిలబడి ప్రజా సమస్యలపై స్పందిస్తూ క్యాడర్ తో పాటు కార్యకర్తలను మమేకం చేస్తూ పార్టీకి మద్దుతుగా నిలిస్తున్నారు. ఈ నేపథ్యంలో లోనే జిల్లా వ్యాప్తం గా ఆయా మండలాలలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవాబుపేట కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, ప్రశాంత్ కుమార్, నరేందర్ రెడ్డి, కద్చర్ల సుధాకర్, శ్రీకాంత్ గౌడ్, బద్రి,కిషోర్, బక్కని శేఖర్, రాజు, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

దుబ్బాక 100 పడకల ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



**దుబ్బాక, జూన్ 7(నినాదం):** నినాదం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో, శిశిర ఆసుపత్రి సహకారంతో దుబ్బాక ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని సందర్శించిన ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు నిర్ధారణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమవడంతో పాటు ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆరోగ్య పరీక్షల పట్ల అవగాహన పెంచుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్, డాక్టర్ సింధూ మాధవనేని మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెప్పారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన మహిళలకు అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిం చారు. శిబిరంలో పాల్గొన్న మహిళలు ఇటువంటి ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల ఎంపీ రఘునందన్ రావు, శిశిర ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యమరాజ్ సింగ్ దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

# విద్య హక్కు... వ్యాపారం కాదు! రవి రాజ్ రాథోడ్




**కీసర, జూన్7 (నినాదం) :** విద్య అనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని, అది ధనికులకు మాత్రమే కాకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో ఉండాలని జనసేన నాయకుడు రవిరాజ్ రాథోడ్ అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో లోపాలు, ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులు విద్యా రంగంలో ప్రధాన సమస్యలుగా మారాయని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా ఉండేవని, కానీ ప్రస్తుతం మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజల విశ్వాసం తగ్గుతోందని రవిరాజ్ రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మరోవైపు, ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్, ట్యూషన్, బస్సు, యూనిఫాం, పుస్తకాల పేరుతో భారీ మొత్తాలను వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన విమర్శించారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడం ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం తగిన స్థల విస్తీర్ణం, ఆటస్థలం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు తప్పనిసరి అయినప్పటికీ, అనేక ప్రైవేట్ పాఠశాలలు వాటిని పాటించడం లేదని రవిరాజ్ రాథోడ్ ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యా హక్కు చట్టం (=ఐజు) ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టడం, విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించవచ్చని జనసేన నాయకుడు రవిరాజ్ రాథోడ్ పేర్కొన్నారు.

# కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవోగా కట్టా సుధాకర్ రెడ్డి బాధ్యత స్వీకరణ..



వరంగల్ డీసీగా కృష్ణ ప్రసాద్ బదిలీ

ఘనంగా వీడ్కోలు పొందిన మాజీ ఈవో కృష్ణ ప్రసాద్

**కొమురవెల్లి, జూన్7 (నినాదం) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ నూతన కార్యనిర్వాహణాధికారి (ఈవో)గా కట్టా సుధాకర్ రెడ్డి ఆదివారం పూర్తి అదనపు బాధ్యతలను ఎఫ్ ఏ సీ గా స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా సేవలందించిన ఏ. కృష్ణ ప్రసాద్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా బదిలీ కావడంతో, అతని స్థానంలో సుధాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. భక్తులకు సేవ చేయడమే నా భాగ్యం: ఈవో సుధాకర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఈవో సుధాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్లికార్జున స్వామివారి క్షేత్రంలో సేవ చేసే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గతంలో తనకు ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బాసర సరస్వతి అమ్మవారి ఆలయం, నాచారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయం మరియు కీసర దేవాలయాల్లో పనిచేసిన అనుభవం ఉందని గుర్తుచేసుకున్నారు. "ఏ దేవాలయానికైనా భక్తులే అత్యంత ముఖ్యం. కొమురవెల్లి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించడమే నా ప్రథమ కర్తవ్యం. సంక్రాంతి పండుగ నుండి ఉగాది వరకు కొమురవెల్లిలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ఆ సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం సులభంగా జరిగేలా ఇతర సౌకర్యాలలో లోపాలు లేకుండా ముందస్తుగానే పక్కా యాక్షన్ ప్లాన్ (ప్రణాళికలు) సిద్ధం చేస్తామని ఈవో హామీ ఇచ్చారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన కట్టా సుధాకర్ రెడ్డి కి ఆలయ అర్చకులు, అధికారులు వేద ఆశీర్వచనాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు (సూపరింటెండెంట్) చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఎలక్ట్రికల్ ఏఈ భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మధుకర్, నవీన్ మరియు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాపీ మేస్త్రిల బంద్‌ను విజయవంతం చేయండి



**మల్కాజిగిరి, జూన్7 (నినాదం):** తాపీ మేస్త్రిల బందును విజయవంతం చేయాలని కోరుతూఆదివారం యాప్రాల్ లోని వివిధ కాలనీలో భవన నిర్మాణ కార్మిక క సంఘం నాయకుల ఆధ్వర్యంలో తాపీ మేస్త్రి లు బైక్ ర్యాలీని నిర్వహించారు. భవన నిర్మాణ యాజమాన్యాలకు కరపత్రం అందించి బందు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కే రమేష్ సింగ్అ,ల్వాల్ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి అమరావతి, బాబు, అల్వాల్ మండల ఏఐటియుసి అధ్యక్షులు బి నరేంద్ర చారి, భవన తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కృషి డిఫెన్స్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే జిఎంఆర్

సమస్యల పరిష్కారానికి హామీ..





**పటాన్చెరు, జూన్7 (నినాదం) :** పటాన్చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మాజీ ప్రజా ప్రతినిధులు, బల్దియా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వర్షపు నీరు బయటకి వెళ్లకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. అతి త్వరలో వర్షపు నీరు తరలించేందుకు ప్రత్యేక డ్రైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణికి ఆదేశించారు. హైమాస్ట్ లైట్లు, బిటి రెన్యువల్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల ప్రార్థన మందిరాల నిర్మాణం కోసం వివాదాలు లేకుండా కాలనీలోనే స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలో గల ఇండోర్ స్టేడియం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, శ్రీరాములు, బలవంత్, వెంకటేష్, కాలనీ అధ్యక్షులు అమరేందర్, మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో సమస్యల పరిశీలనకు మాజీ కార్పొరేటర్ పాదయాత్ర



**అల్వాల్, జూన్7 (నినాదం) :** న్యూ ఎం ఎస్ కాలనీ( కిష్టమ్మ ఎంక్లేవ్ లో పర్యటించిన మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాజీ కార్పొరేటర్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ సమస్యలపై చర్చించారు. కాలనీలో అభివృద్ధి పనులను సమీక్షించారు త్వరలో ప్రారంభం కానున్న వాటర్ పైప్ లైన్ పనుల గురించి కాలనీ వాసులతో చర్చించారు. కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ కు కాలనీ సమస్యలు మురుగు కాలువలు. దెబ్బతిన్న ప్రధాన రహదారులు గ్రీన్ ఫీల్డ్ కాలనీలో కొత్త సిసి రోడ్డ నిర్మాణము చేపట్టాలని ఆమెకు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులుబాలకృష్ణ, నవీన్, శివయ్య, నాయకులు లింగారెడ్డి ,అరుణ్, భాస్కర్, పాల్గొన్నారు

## ఆమనగల్లు ఎస్సైగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకారం



**ఆమనగల్లు, జూన్7 (నినాదం):** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సబ్-ఇన్స్పెక్టర్ సి. కోటేశ్వరరావు మొకిలా పోలీస్ స్టేషన్ నుండి ఆమనగల్లు పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించి ఏసీపీ జానకి రెడ్డి, డీసీపీ నారాయణ రెడ్డి, ఎస్హెచ్ఓ వెంకటేశ్వర్లు జడ్జి అరుణ్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఆయన పనిచేయనున్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అరికెపూడి గాంధీ, కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్, జూన్7 (నినాదం) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ తో కలిసి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సభ ఏర్పాట్లను పర్యవేక్షించి పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 8 సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్యాలయం శంకుస్థాపన, పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ సందర్భంగా మియాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తో పరిశీలించి పోలీసు, మునిసిపల్ అధికారులను సమన్వయం పరుస్తూ పలు సలహాలు సూచనలు తెలిపారు.

# ఆరుగురు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్

విద్యార్థులను అభినందించిన రామకృష్ణ రెడ్డి



**రాజేందర్ నగర్, జూన్7 (నినాదం):** మనికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మెయిన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరచి విశేష విజయాన్ని సాధించారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో పాఠశాలకు చెందిన మొత్తం ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించి రికార్డు సృష్టించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నుండి వారి ఉన్నత విద్య కోసం ప్రతి సంవత్సరం రూ. 12,000/- చొప్పున స్కాలర్షిప్ లభించనుంది. ఈ ఆర్థిక సహాయం విద్యార్థుల పైచదువులకు ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

**ఎంపికైన విద్యార్థులు..**

ఎం. వాసవ్,టి. భార్గవి,ఎం. సాక్షి, డి. ప్రియ,పి. విజయలక్ష్మి,చైతన్య ప్రతిభావంతులకు అభినందన ఈ సందర్భంగా మనికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి పాఠశాలను సందర్శించి, అర్హత సాధించిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ఇలాంటి ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉన్నతికి, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ విజయానికి ప్రత్యేక కృషి చేసిన పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు నిరంజన్ , ప్రస్తుత ప్రధానోపాధ్యాయులకు, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ డైరెక్టర్ కుమార్, నాయకులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్బీనగర్, మే 7(నినాదం):** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీ సంక్షేమ సంఘం వారు కాలనీలో నూతనంగా సిసి కెమెరాల ఏర్పాటు చేశారు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించిన దాతయిన ఉపేందర్ రెడ్డి తో కలిసి ఎసిపి కృష్ణయ్య, చైతన్యపురి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు సీసీ కెమెరాల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాత ఉపేందర్ రెడ్డిని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి, ఎసిపి మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాట నందిస్తాయని, ప్రతీ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని, ఇప్పటికే పలు కాలనీలో సీసీ కెమెరాలు ఉన్నాయి. నేరం జరిగినపుడు దాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పెద్ద పెద్ద నేరాలను కూడా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు: ఎన్. రామ్‌గోపాల్, వ్యవస్థాపక సభ్యుడు: పి.ఎస్. రామన్, ఉపాధ్యక్షుడు: ఎన్.ఎస్.ఎన్. మూర్తి, కోశాధికారి: కె. శ్రీనివాస్, సెక్టర్ ఎస్సై గోవర్ధన్, సాంకేతిక రంగ పోలీసులు రాజా రెడ్డి, రాకేష్ ఇతర కార్యవర్గ సాధారణ సభ్యులు: పీ.ఏ. సుబ్బారావు, ఎన్. వేణుగోపాల్, వంశీకృష్ణ, సుజాత గౌడ్, టి. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, భీమలింగం, శేషాద్రి, డి. పుల్లారెడ్డి, వి.వి. సుబ్బారావు, బి. నారాయణరావు, జె. పాండరీనాథ్, రాజేష్, ఈ.బి. రమణ, రాఘవన్, కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్ పెద్దమ్మ గుడి వద్ద షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నీలం

సొంత నిధులతో ముందుకు వచ్చిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు..

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు





**పటాన్చెరు, జూన్7(నినాదం) :** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి ఇస్నాపూర్ లోని పెద్దమ్మ దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించ తలపెట్టిన షెడ్డు నిర్మాణ పనులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండకు, వానకు పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని నీలం మధు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, ప్రభుత్వ నిధుల మంజూరు ప్రక్రియ కోసం వేచి చూడకుండా, భక్తుల కష్టాలను తీర్చడమే ధ్యేయంగా తన సొంత నిధులతోనే ఈ షెడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ఉదారంగా ముందుకు వచ్చారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కౌన్సెలర్ మల్లేశ్వరి కుమారుడు మణికంఠ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నీలం మధు, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం షెడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేసి నిర్మాణ వ్యయాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్నాపూర్ పెద్దమ్మ తల్లి దేవాలయానికి ప్రతి వారం నియోజకవర్గ నలుమూలల నుండి వేలాది మంది భక్తులు వస్తుంటారని, ముఖ్యంగా పండుగలు, జాతరల సమయంలో సరైన నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆధ్యాత్మిక భావన సమాజంలో శాంతిని పెంపొందిస్తుందని, అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించాలనే సంకల్పంతో ఈ నిర్మాణాన్ని తలపెట్టినట్లు వివరించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజాసేవలోనూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి, రాజకీయాలకు అతీతంగా సొంత ఖర్చులతో నీడను కల్పించేందుకు ముందుకు రావడంపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నీలం మధును శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి మణికంఠ, కౌన్సిలర్స్ మన్నే రాఘవేంద్ర, వెంకటేష్ నాయక్, సంగన్నగారి గోపాల్, సందీప్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, శంకర్, సంజీవ, ఆంజనేయులు, కృష్ణ, రాజు, మున్సిపాలిటీ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, యువకులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పటాన్‌చెరులో తెలంగాణ రక్షణ సమితి జెండా ఆవిష్కరణ

కాలుష్య నియంత్రణ, భూముల పరిరక్షణ, రాజకీయ దోపిడీకి అడ్డుకట్టే లక్ష్యం: కవిత





**పటాన్చెరు, జూన్7 (నినాదం):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో తెలంగాణ రక్షణ సమితి పార్టీ జెండాను పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటాన్‌చెరు పేరు చెప్పగానే కాలుష్య సమస్య గుర్తుకు వస్తుందని అన్నారు. కాలుష్య నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టకుండా, అదే కారణంగా పరిశ్రమలను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పరిశ్రమలు తగ్గితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారో పాలకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గం వివిధ ప్రాంతాల ప్రజలు నివసించే ప్రాంతంగా నిలిచిందని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రవహించిన నక్కవాగు ప్రస్తుతం ఎండిపోయి, కాలుష్య జలాల ప్రవాహ మార్గంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జలాలు మంజీరా నదిలో కలుస్తూ పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రక్షణ సమితి ప్రధాన లక్ష్యం తెలంగాణ భూములు, సహజ వనరులు, పర్యావరణాన్ని పరిరక్షించడమేనని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు స్వప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రాంత అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందని ఆరోపించారు. వివిధ పార్టీల నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చివేసే ప్రయత్నం జరిగినప్పుడు ప్రజలే ముందుకు వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. స్థానికుల నిరసనల నేపథ్యంలో పాఠశాల ప్రాంగణానికి రక్షణ గోడ నిర్మించాల్సి వచ్చిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న కుమ్మక్కు రాజకీయాలకు అడ్డుకట్ట వేస్తూనే, కాలుష్య నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ రక్షణ సమితి కట్టుబడి ఉందని కవిత వెల్లడించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్



**అమరచింత, జూన్ 7 (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ 1వ వార్డ్ ఖానాపూర్ లో డీలర్ బాలస్వామి ఇంటిదగ్గర ఉన్న బోరింగు కు బోర్ ఫిట్టింగ్ చేయించి అనంతరం టెంకాయ కొట్టి బోర్ ప్రారంభించి తాగునీరు అందజేసిన కోట్ల తిరుపతి. కాలనీలో తాగునీటి కొరత ఉందని కాలనీ ప్రజలు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ బోరును మరమ్మతులు చేయించి కాలనీవాసులక్కు నీటిని అందించారు. మంచినీళ్ల కోసం ప్రజలకు ఇబ్బంది కలగకూడదని అందుకే బోర్ ని చేయించామని కౌన్సిలర్ తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలోకావలి లక్ష్మన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భగవంతు ఆత్మకూర్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు కావలి లక్ష్మన్న నారాయణరెడ్డి వార్డు వైస్ ప్రెసిడెంట్ రాజన్న, వడ్డే గోపాల్, ఫోటో వెంకట్ రాములు, ఎస్ లక్ష్మన్న, పి బాబు, కురుమూర్తి, నాగేందర్ గౌడ్, మల్లేష్, కుమ్మరి విజయ్, ఏవైసీ సెక్రెటరీ గడ్డం శ్రీకాంత్, కావలి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయవంతమైన వైద్య శిబిరం

### 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు



**అమరచింత, జూన్ 7(నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ 1వ వార్డ్ ఖానాపూర్ లో ఆదివారం సాయి కృష్ణ సూపర్ స్పెషాలిటీ న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.వార్డ్ కౌన్సిలర్ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేసుకున్నారు. వైద్య నిపుణులు డాక్టర్.పాశం గోవర్ధన్ రెడ్డి న్యూరోలజి డాక్టర్ శరత్ చంద్ర ఎండి డిఎం న్యూరో, ఎంబిబిఎస్ ఎఫ్ఈఎం (కే ఐ ఎం ఎస్), డాక్టర్ కే. సాయి తేజ, జనరల్ మెడిసిన్ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి, డి ఎన్ బి జనరల్ సర్జన్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.వెంకటేశ్వర్ రెడ్డి,అగ్రికల్చర్ హార్టికల్చర్,ఈ కార్యక్రమంలోనరేష్ ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్ మునిసిపల్ అధికారి అశోక్ గడ్డం శ్రీకాంత్, హాస్పిటల్ ఇబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 15 బాక్సింగ్ పోటీలకు ఎంపిక



**మిర్యాలగూడ, జూన్ 7 (నినాదం):** ఎన్బిఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 15 బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ సెలక్షన్స్ మిర్యాలగూడ ఎన్ఎస్పి రాజీవ్ గాంధీ అవుట్డోర్ స్టేడియం బాక్సింగ్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. టోర్నమెంట్లో12 మంది బాలురు,3 బాలికలు ఈనెల 13.14న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సెలెక్టయ్యారు. టోర్నమెంట్ ముఖ్య అతిథులు డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, నాయకులు గుడిపాటి నవీన్ టోర్నమెంటును ప్రారంభించారు. డీఎస్ఎ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్సీ బాక్సింగ్ కోచ్ ఈ.రవీందర్ గౌడ్, సెక్రెటరీ ఈ.ప్రవీణ్, బ్యాట్మెంటన్ కోచ్ రామకృష్ణ, జూడో కోచ్ శ్రీధర్, బాక్సింగ్ సీనియర్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

# 'జనం మాట--పల్లెబాట'

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, జూన్ 7(నినాదం):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం జనం మాట--పల్లెబాట'కు ఆదివారం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన 14 ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రతి ఆదివారం ఐదు రోజుల పాటు గ్రామాల్లో పర్యటిస్తూ పల్లెనిద్ర చేయనున్నారు. మొదటి రోజు ఆమనగల్లు గ్రామంలోనే రాత్రి బస చేసిన ఆయన, అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై గ్రామస్తులతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధి స్వయంగా గ్రామంలో బస చేస్తూ సమస్యలు వినడంపై





గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల కష్టసుఖాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే 'జనం మాట--పల్లెబాట' కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. వారంలో ఐదు రోజులు ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పల్లెనిద్ర ద్వారా గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలు.. వృద్ధులకు ఆత్మీయ భరోసా





### ప్రతిఒక్కరూ కంటి ఆపరేషన్లు చేయించుకోండి

### 14వ విడత ఉచిత కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో లక్ష్మిరాజ్ గోపాల్‌రెడ్డి

**మునుగోడు, జూన్ 7 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం. మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మర్రిగూడ మండల ప్రజలకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవసారి ఏర్పాటుచేసిన 14వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి.వైద్య శిబిరానికి కంటి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్క మహిళలను వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వ్యక్తిగత బాగోగులు కుటుంబ బాగోగులు అడిగి తెలుసుకున్నారు.కంటి చికిత్సకు ఎంపికైన వారికి భయపడకుండా చికిత్స చేయించుకొండని ధైర్యం చెప్పారు. కంటి ఆపరేషన్ చేయించుకుంటే ప్రతి ఒక్కరికి చూపు బాగా కనిపిస్తుందని, ఆపరేషన్ అవసరం లేని వారికి పరీక్షలు చేసి కళ్ళజోళ్ళు కూడా ఇస్తామన్నారు. ఆపరేషన్లకు వెళ్లేవారు టెన్షన్ పడకుండా, భయపడకుండా ఉంటేనే ఆపరేషన్ సక్సెస్ అవుతుందని, సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే 9,766 మందికి కంటి పరీక్షలు చేయించి, 2,198 మందికి ఆపరేషన్లు పూర్తి చేయించామని, 4,227 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశామని గుర్తు చేశారు...వేలమందికి ఆపరేషన్ చేయించామని ముందు ముందు ఇంకా చేయిస్తామని, ఆపరేషన్లకు ఎంపికైన వారు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం కల్పించి స్వయంగా భోజనం వడ్డించారు లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల స్థానిక నాయకులు తదితరు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**భూపాలపల్లి బ్యూరో, జూన్ 7 (నినాదం):**జయశంకర్ భూపాలపల్లి మండలం ఖాసీంపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, సీసీఎస్ సిఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (36) వద్ద నుండి అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ.1,92,000గా అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం,



విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

### వనపర్తి జట్టుపై 8 వికెట్ల తేడాతో

## జడ్చర్ల ఘన విజయం



**పెబ్బేరు, జూన్ 7 (నినాదం):** పెబ్బేరు మున్సిపల్ క్రికెట్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో జడ్చర్ల జట్టు అద్భుత ప్రదర్శనతో వనపర్తి జట్టుపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి హాజరై టాస్ నిర్వహించారు. టాస్ గెలిచిన వనపర్తి జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే జడ్చర్ల బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తట్టుకోలేక 29.4 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌటైంది. వనపర్తి బ్యాటర్లలో సూరజ్ 48 బంతుల్లో 28 పరుగులు చేయగా, పవన్ రెడ్డి 32 బంతుల్లో 13 పరుగులు చేసి రాణించారు. జడ్చర్ల బౌలర్లలో భాను తేజ్ అద్భుతంగా రాణించి 5 ఓవర్లలో కేవలం 12 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశాడు. అనంతరం 102 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన జడ్చర్ల జట్టు సమష్టి కృషితో లక్ష్యాన్ని ఛేదించి 8 వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జడ్చర్ల ఆటగాడికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ప్రదానం చేశారు. ఈ విజయంతో టోర్నమెంట్‌లో జడ్చర్ల జట్టు తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**మహాదేవపూర్, జూన్ 7 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ముకునూరులో పలు బాధిత కుటుంబాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పరామర్శించారు.



గ్రామానికి చెందిన దుగ్గిరాల రంగారావు ఇటీవల మృతిచెందవ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎర్రవెల్లి వసంతరావు తండ్రి, తిప్పనపల్లి ముత్తయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 46 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు





**అమరచింత, జూన్ 7 (నినాదం):** పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘకాలం తర్వాత ఆదివారం అమరచింత డిఎంఆర్ఎం ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనని నిర్వహించారు. 46 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆనాటి గురువులు గోపాల్ రెడ్డి సత్యనారాయణ శెట్టి షేక్ అహ్మద్ లకు పాదాభివందనం చేశారు. ఆనాడు చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ హోదాలలో ఉండి సమ్మేళనానికి హాజరయ్యారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు గురువులు చెప్పిన పాఠాలవల్లే నీవు ఈనాడు ఈ స్థితిలో ఉన్నామని టెలిఫోన్, ఆర్టీసీ, ఎడ్యుకేషన్, మిలట్రీ లో పనిచేసిన పూర్వ విద్యార్థులు తెలిపారు.

అనంతరం తమ గురువులతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్కల నరసింహులు గౌడ్, దేవేందర్ రెడ్డి, మనీ వర్ధన్ రెడ్డి అబ్రహం, టెలిఫోన్ కృష్ణమూర్తి, జగన్నాథం కోదండ రెడ్డి, వెంకట్ రెడ్డి, జయసింహారెడ్డి లక్ష్మీశెట్టి, వీద శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు కట్టారు.. గోనె వేయడం మరిచారు

- రైతులకు ఏళ్లుగా రాకపోకల కష్టాలు

**కోదాడ/చిలుకూరు(నినాదం):** చిలుకూరు మండల కేంద్రంలోని రెడ్లకుంట మేజర్ కాల్వ నుంచి 8-ఆర్ కాల్వపై నిర్మించిన కల్వర్టు రైతులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడకుండా ఉంది. కల్వర్టు నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచినా, దానిపై సిమెంట్ గోనె ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గతంలో నీటి సంఘం చైర్మన్ కొల్లు స్వామి హయాంలో ఈ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు నిర్మాణంతో కాల్వలో నీటి వృథా నివారించబడినప్పటికీ, రైతుల రాకపోకలకు అవసరమైన గోనె ఏర్పాటు చేయకపోవడం వల్ల సమస్య అలాగే కొనసాగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పొలాలకు వెళ్లే దారి సరిగా లేక వ్యవసాయ పనుల సమయంలో ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు మోసుకెళ్లడం కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు కాల్వ దాటలేక రైతులు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు.



ప్రతి పంట సీజన్‌లో ఇదే సమస్య ఎదురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి కల్వర్టుపై సిమెంట్ గోనె ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరుతున్నారు.ఈ సమస్య పరిష్కారమైతే పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

**తక్షణమే సమస్య పరిష్కరించాలి...**



ఈ సమస్యపై రైతు నాయకుడు పుట్టపాక దశరథ్ యాదవ్ మాట్లాడుతూ, కల్వర్టు నిర్మాణం పూర్తయి ఏళ్లు గడిచినా గోనె ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రైతులు ప్రతిరోజూ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగుమందులు తరలించడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి సిమెంట్ గోనె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## ధ్వంసమైన రోడ్లను వెంటనే బాగుచేయాలి

### బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్

### నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు



**వనపర్తి ప్రతినిధి, జూన్ 7 (నినాదం):** జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను తక్షణమే బాగు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వనపర్తి-పెబ్బేరు రోడ్డును బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 600 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు ఉన్నాయని, అందులో 200 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతల మయంగా ఉందన్నారు.వనపర్తి నుంచి పెబ్బేరు వరకు 20 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డులో తొమ్మిది కిలోమీటర్లకు పైగా అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకయాతన కలిగిస్తుందని తెలిపారు. ప్రతినిత్యం అభివృద్ధి పేరుతో జపం చేస్తున్న జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వనపర్తి-పెబ్బేరు రోడ్డు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అనారోగ్య సమస్యలతో పెబ్బేరు నుంచి వనపర్తికి వచ్చే ప్రయాణికులు గతుకుల, గుంతల మయంగా మారిన రోడ్డు వల్ల మార్గమధ్యలోనే అనంత లోకాలకు వెళ్లే విధంగా రహదారి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆర్ అండ్ బి అధికారులను సంప్రదించగా రోడ్డు మరమ్మత్తులకు శాంక్షన్ కాలేదని బదులివ్వడం ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లుగా ఇటీవలే ప్రజా ప్రతినిధులు వెల్లడించినట్లు ఆయన గుర్తు చేశారు. మరి వనపర్తి-పెబ్బేరు బీటి రోడ్డు అభివృద్ధిలో భాగం కాదా..? ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పెబ్బేరు, వనపర్తి రోడ్డుతో పాటు జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను బాగు చేయాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఏసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిళ్ళ రామన్ గౌడ్ పాల్గొన్నారు

## డైరెక్టర్‌గా ఎన్నికైన రామారావుకు ఘన సన్మానం

**కోదాడ, జూన్ 7(నినాదం):** కోదాడ పెద్ద చెరువు మత్స్య సహకార సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన గుండ్లపల్లి రామారావును కోదాడ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి ఎదిగి ప్రజా సేవా రంగంలో గుర్తింపు పొందడం అభినందనీయమని సభ్యులు పేర్కొన్నారు.మత్స్యకారుల సంక్షేమం, చెరువు అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన గుండ్లపల్లి రామారావు తనపై నమ్మకం ఉంచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, సంఘ అభివృద్ధికి కృషి



చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోదాడ వాకర్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## రేపు పెబ్బేరులో ఎమ్మెల్యే మేఘారెడ్డి పర్యటన

**పెబ్బేరు, జూన్ 7 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయాలతో బస్సు యాత్ర కార్యక్రమం సోమవారం (జూన్ 8) పెబ్బేరులో జరగనుంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఉదయం 9 గంటలకు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ చౌరస్తా వద్ద కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్,



వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం
రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




# ఏడాదిలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**జగిత్యాల ప్రతినిధి, జూన్7 (నినాదం) :** జిల్లాలో ని ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏడాదిలోపు నియోజక వర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగు నీరు అందిం చడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామంలో రూ. 7.65 లక్షలతో పెద్ద చెరువు తూము మరమ్మ త్తు పనులకు మంత్రి అడ్లూరి శంకు స్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి అడ్లూరి మాట్లా డుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో అనేక సాగు నీటి ప్రాజెక్టు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పూర్తి చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నారని మంత్రి అన్నారు. నియోజ కవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ. 1,000 కోట్లు అవస రమని, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అంగీక రించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవ ర్గం లోని పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వా యర్ నుండి కొత్తపల్లి వరకు కాలువ పనులతో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

**ముఖ్యమంత్రి సహాయ నిధి, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..**

గొల్లపల్లి మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల పరిషత్ కార్యాలయం లో అందజేశారు. మండలంలోని 17 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయగా 72 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 26 లక్షల 12 వేల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహా య నిధి కొరకు ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మంత్రి..**

గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహిం చిన పోచమ్మ బోనాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు మంత్రి గారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజ లు నిర్వ హించారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజ లను ఎల్లవే ళలా పోచమ్మ తల్లి చల్లగా చూడాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్ తో పాటు నాయకులు నిశాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ తో పాటు మండ లం లోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# బౌరంపేటలో ఐరా యూనివర్సల్ స్కూల్‌ను ప్రారంభించిన గవర్నర్




**కుత్బుల్లాపూర్, జూన్7 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బౌరంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరా యూనివర్సల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గవర్నర్ తో పాటు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫె సర్ డా. జె. అనురాధ పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ డా ఎస్ మల్లా రెడ్డి అతిథులకు స్వాగతం పలికి, నాణ్యమైన విద్య ద్వారా సమాజాభివృద్ధికి కృషి చేయ డం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సంద ర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విలువలు, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో పాఠశాలలు, ఉపా ధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు రోజులో ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, అందువల్ల వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులను, బాధ్యతా యుతమైన నాయకులను రూపొందించే విద్యాసంస్థలే దేశ నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక మాధ్య మాలపై అధిక సమయం వెచ్చించడం కంటే క్రీడలు, శారీరక వ్యాయామాలు, సృజనాత్మక కార్యకలా పాలపై దృష్టి సారించాలని సూచించారు. ఐరా యూనివర్సల్ స్కూల్ బ్రోచర్‌ను పరిశీలించినప్పుడు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పాఠశాల ఇస్తున్న ప్రాధాన్యత తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్ష ణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టే విద్యాసంస్థలే సమాజానికి ఉత్తమ పౌరులను అంది స్తాయని పేర్కొన్నారు. ఇదే దిశగా పాఠశాల తన ప్రయాణాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం అతి థులు పాఠశాల ప్రాంగణంలోని ఆధునిక సౌకర్యా లను పరిశీలిం చారు. తూర్పు రాఘవ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో స్థాపిం చబడిన ఈ విద్యాసంస్థ, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలలు, ఇండస్ వ్యాలీ ఇంట ర్నేషనల్ స్కూల్ తుర్కయాంజల్, ఇండస్ వ్యాలీ ఇంట ర్నేషనల్ స్కూల్ గోపన్‌పల్లి వంటి విజయవంత మైన విద్యాసంస్థల వారసత్వాన్ని కొనసాగిస్తోంది. సంస్థ అభివృద్ధికి డా. మల్లా రెడ్డి విద్యా సంస్థ చైర్మన్, డా. భూపాల్ రెడ్డి, రాజా భాస్కర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి లు తమ విలువైన మార్గ దర్శకత్వాన్ని అందిస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డా. జి. అనురాధ మూర్తి జోయె ల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో విద్యా ప్రావీణ్యంతో పాటు విలువలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యతను పెంపొందించేం దుకు ఐరా యూనివర్సల్ స్కూల్ కట్టుబడి ఉందని తెలిపారు. (Where Excellence Meets Purpose) నిర్దిష్టమైన లక్ష్యం అనే నినాదంతో ఐరా యూనివర్సల్ స్కూల్ ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నదని ఆమె పేర్కొన్నారు. ఐరా యూనివర్సల్ స్కూల్ బౌరంపేట లో ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్ర గవర్నర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్, బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కొలను హనుమంత రెడ్డి




**కుత్బుల్లాపూర్, జూన్7 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాంధీ నగర్ లోని ఠాగూర్ హై స్కూల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దపురం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో, ప్రసిద్ధ అలీవ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను వారి నివాస ప్రాంతాలకే తీసుకువచ్చి అందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆయన ఆకాంక్షించారు. మెగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి కావలసినవారికి మందులు అందజేశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముద్దపురం శ్రీకాంత్ గౌడ్ గారిని, అలీవ హాస్పిటల్ డాక్టర్లను, పారామెడికల్ సిబ్బందిని హన్మంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన కేడీసీసీ బ్యాంకు చైర్మన్



**జమ్మికుంట, జూన్ 7 (నినాదం) :** కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన కరీంనగర్ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఆదివారం కరీంనగర్ కు వచ్చిన హరీష్ రావును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీష్ రావును హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సన్మానించిన కే డి సి సి బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. అనంతరం స్థానిక రాజకీయాల తోపాటు ఓటర్ నమోదు ప్రక్రియ కార్యక్రమం సభ్యత్వ నమోదు విషయాలపై చర్చించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించగా తప్పకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వారికి తెలిపినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తక్కల్లపల్లి సత్యనారాయణ రావు జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు స్థానిక టిఆర్ఎస్ నేతలు చుక్క రంజిత్ యూత్ నాయకులు మహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు

N NADAM CINEMA

# కొన్నాళ్లకు నాపై ఒత్తిడి పెరిగింది..

## అందుకే వాటికి దూరం అయ్యా



హీరోయిన్ తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయ్యేం దుకు సిద్ధం అవుతున్నది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండటంపై షాకింగ్ అభిప్రాయాన్ని పంచుకుంది తాప్సీ. 'సోషల్ మీడియాలో తక్కువగా కనిపించాలని గత ఏడాదే నిర్ణయం తీసుకున్నా. దీనికి ప్రత్యేకంగా ఎలాంటి కారణం లేదు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. నేను సోషల్ మీడియా స్టార్ట్ చేసిన కొన్నాళ్లకు అది పరుగు పందెంలా అనిపించడం. అందరూ ఏదో ఒకటి పోస్ట్ చేస్తూ, ఎప్పుడూ కనిపిస్తూ ఉండాల్సిందే అన్న ఒత్తిడి పెరిగింది. అందుకే నా జీవితాన్ని ప్రశాంతంగా గడపడా నికి, మానసిక ప్రశాంతతను కాపాడుకోవ డానికి కొంతకాలం సోషల్ మీడి యాకు దూరంగా ఉండాలని ఆ నర్ణయం తీసుకున్నా'. అని తెలిపింది.

# జాన్వీకి పెరుగుతోన్న మద్దతు..

**హీరోయిన్లను కాదు, వ్యవస్థను నిందించండి అంటూ డింపుల్ హయాతి ఫైర్**




రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ మూవీ రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అయితే.. ఇందులో జాన్వీ పాత్రపై మాత్రం విమర్శలు ఎదురవుతున్నాయి. ఆమెను గ్లామర్ బొమ్మలా, రొమాంటిక్‌గా మాత్రమే చూపించారని, పాత్రలో ప్రాధాన్యత లేదని నెట్టింట ట్రోల్స్ వస్తున్నాయి. దీనిపై రీసెంట్‌గా డైరెక్టర్ బుచ్చిబాబు స్పందించి ఇప్పటికే క్షమాప ణలు చెప్పిన విషయం తెలిసిందే. కానీ, కొందరు మాత్రం అలాంటి పాత్ర కేవలం డబ్బుల కోసం మాత్రమే ఒప్పుకుందంటూ జాన్వీపై సైతం నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే జాన్వీ కపూర్‌పై సోషల్ మీడియాలో మద్దతు పెరుగుతోంది. అలాంటి పాత్రలు రాస్తున్న మేకర్స్‌ను వదిలేసి హీరో యిన్స్‌ను తప్పుపట్టడం ఎంతవరకు కరెక్ట్ అంటూ పలువురు హీరోయిన్స్ తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా డింపుల్ హయాతి కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 'నటీమణుల పాత్రలను రాస్తున్న విధానంపై కాకుండా.. వారికి ఇచ్చిన పాత్రలను చేసినందుకు హీరోయిన్స్‌ను మాత్రమే తప్పుబట్టే విధానంపై చర్చ జరగడం నిజంగా సంతోషకరం. ఇక్కడ హీరోయిన్స్‌ను ఇలా మాత్రమే చూపిస్తే అమ్ముడుపోతాయి అని భావించే మేకర్స్ (నిర్మాతలు, దర్శకులు), అండ్ ఈ సినిమా వ్యవస్థను నిందించాలి. మాలాంటి నటీనటులు లభించే అవకాశాలను వినియోగించుకుంటూ, పెద్ద సినిమాల్లో నటిస్తూ మరింత మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ఆశపడుతుంటాము. అయితే.. ఒక పాత్ర సరిగ్గా రాయబడకపోతే ఆ బాధ్యత ఆ పాత్రను పోషించిన మహిళది కాదు, అది పూర్తిగా రైటింగ్ అండ్ మేకింగ్ ఛాయిస్‌లదే అవుతుంది. దురదృష్టవశాత్తూ మేము చేసే పాత్రల ఆధారంగా మా మీద ఒక ముద్ర పడిపోతుంది. దీనివల్ల పూర్తి నటనా సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం కూడా దక్కదు. అదే సమయంలో హీరో ప్రధాన పాత్ర కథల విషయానికి వస్తే వారికి కావాల్సినంత స్వేచ్ఛ, ప్రాధాన్యత లభిస్తాయి. స్క్రీన్‌పై ఏం చూస్తామో దాన్నే ప్రేక్షకులు నమ్ముతారు. సినిమా నిర్మాణంలో ఉండే పరిస్థితులు ఒక్కరి నిర్ణయంపై మాత్రమే ఆధారపడి ఉండవు. అయితే.. మేము కూడా మంచి పాత్రలకు, మంచి సినిమాలకు అర్హులమనే విషయాన్ని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించాలి' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది డింపుల్ హయాతి.

# వైరల్‌గా దిశా పటాని పోస్టులు



బీటౌన్ యంగ్ బ్యూటీ దిశా పటాని, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఆవారాపన్ 2'. 2007లో విడుదలై కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్టుపై బాలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్ర ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ఈ సినిమా నుంచి మరో అప్డేట్ వచ్చింది. 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ టీజర్ జూలై 1న విడుదల కానున్నట్లు బాలీవుడ్ ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. ఈ టీజర్ దిశ, ఇమ్రాన్ మధ్య ఉండబోతుందని తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ప్రమోషన్స్ అప్పుడే స్టార్ట్ చేసిన దిశ.. సోషల్ మీడియాలో అదిరిపోయే పోస్టులతో కుర్రకారుని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. కాగా.. 'అభిమానులకు తెలుసు ఇది కేవలం ముగింపు మాత్రమే కాదని.. అతను మీ కోసమే మళ్లీ తిరిగి వచ్చాడు' అంటూ మేకర్స్ ఇటీవల రిలీజ్ చేసిన 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమాపై మరిన్ని ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌ను విశేష్ ఫిలిమ్స్ నిర్మిస్తుంది.



# జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న దివి..

**అయినా గ్లామర్ డోస్ మాత్రం తగ్గట్లేదు**

బిగ్ బాస్ బ్యూటీ దివి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమెకు షోలోకి ఎంట్రీ ఇవ్వక ముందు పెద్దగా గుర్తింపులేకపోయినా, షోలో పాల్గొన్న తర్వాత మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. బిగ్ బాస్ నుండి బయటకు వచ్చాక దివి సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటూ, తన ఫోటోలు, అప్డేట్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిట్‌నెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే దివి ఎక్కువ సమయాన్ని జిమ్‌లోనే గడుపుతుంటుంది. వర్కౌట్స్ చేస్తున్న సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలను కూడా ఆమె తరచూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ వస్తోంది. తాజాగా కూడా దివి జిమ్‌లో వర్కౌట్స్ చేస్తూ తీసుకున్న ఫోటోలను తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేసింది.



# అఖిల్ 'లెనిన్'కి అదే కీలకం..

**నాగార్జునకి కూడా సూపర్‌గా నచ్చిందా**

అక్కినేని అఖిల్ ప్రస్తుతం 'లెనిన్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం మనకు తెలిసిందే. ఈ సినిమాను జూన్ 26న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ కాపీ కూడా రెడీ అయినట్లు తెలుస్తోంది. తాజాగా దానిని నాగార్జున చూసినట్లు సమాచారం. ఆయనకు ఈ సినిమా మొత్తం నచ్చినట్లు, ముఖ్యంగా క్లైమాక్స్ ఎపిసోడ్ అయితే బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్ర క్లైమాక్స్‌ను దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు చాలా కొత్తగా డిజైన్ చేసినట్లు, అది ఎవరు ఊహించని విధంగా ఉన్నట్లు సినీ వర్గాల సమాచారం. అఖిల్ హీరోగా కెరీర్ ప్రారంభించి చాలా సంవత్సరాలు అవుతోంది. కానీ ఆయనకు ఇప్పటివరకు సరైన సూపర్ హిట్ దక్కలేదు. ఆ కోరిక ఈ సినిమాతో నెరవేరే అవకాశం ఉన్నట్లు, ఈ సినిమా చూసిన చాలామంది అభిప్రాయపడుతున్నారని తెలుస్తోంది. సినిమాలో అఖిల్‌కు జోడిగా బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటించనుండగా, ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787